# రేణుకాదేవి ఆత్మకథ

(పెద్ద కథ)

౧

"పగలల్లా ఎండ పేల్చేస్తుంది. సాయంత్రం అయే వేళకి యీ చల్లగాలి ఎక్కణ్ణించి వస్తుందోగాని ప్రాణం లేచి వస్తోంది" అంటూ సిగరెట్టు ముట్టించాడు శర్మ.

శర్మకి కుడివైపు దాసూ, ఎడంవైపు లక్ష్మణ్, ఎదురుగా వాసంతీ, జానకీ, రామారావూ కూచుని ఉన్నారు. వెన్నెల సన్నగా కొబ్బరాకుల్లోంచి తప్పుకుని వారిమీద పడుతోంది. దూరాన సముద్రపు హోరు.

"అందుకే మీరు సిమ్లా రమ్మన్నా, యీ స్థలాన్ని వదిలి రాలేను. అందులోనూ వేసంగిలో, యీ చల్లదనాన్ని, చుట్టూ సముద్రాన్నీ యీ తోటలమధ్యనున్న నా రోగుల్నీ వదల బుద్ధెయ్యదు. ఫీల్మీ అందం మీరు యిప్పుడన్నా అర్థం అవుతోందా?" అన్నాడు రామారావు తనుకూడా సిగరెట్ ముట్టిస్తూ.

"మూడురోజులు వుందామని వచ్చినదాన్ని, పదిరోజులయినా, వదలిపోలేకుండా వున్నాను. అక్కడ నాకు మించిపోయే పనులున్నాయి. రేపు ప్రయాణం తప్పదు" అంది జానకి వొళ్ళు విరుచుకుంటూ.

"నీ కెప్పుడూ చందాల గోలేగా! ఆ స్కూలు బెనిఫిట్ షో కోసం కదూ నీ ఆత్రం! ఇంత అందమైన ప్రదేశాన్ని

ఆ నాటకం కోసం వొదిలి వెళ్ళిపోతావా? నేనైతేనా నా ఎత్తు ధనంపోసినా ఆ వెధవ పనులకి వొప్పుకోను." అంది వాసంతి.

"అయితే జానకీ, మీకింకా సంఘోద్ధరణమీద నమ్మకం పోలేదన్నమాట. చందాలకోసం తిరుగుతూనే ఉన్నారా? మీలాంటి విచిత్ర వ్యక్తులు అరుదుగా ఉంటారు సుమండీ! సుఖంగా కాలక్షేపం చెయ్యక ఎందుకొచ్చిన బెడదండీ మీకీ సోషల్ వర్క్?" అన్నాడు శర్మ.

"దాని తత్వమే అంత. చిన్నప్పటి నుంచీ యింతే, అమ్మా వాళ్ళిచ్చిన డబ్బుల్తో మేమంతా కొనుక్కుతింటే, తను బీదపిల్లలకు మరమరాలు కొనిపెట్టేది. ఈ సంఘోద్ధరణ కోసం ప్రతివారితోనూ ఎంతో అణకువగా మాట్లాడుతుంది. వాడిచ్చేది వెధవ పదిరూపాయలు. పాపం, జానకిని యిరవై సార్లు తిప్పుతాడు. అందుకే నాకు యీ దానధర్మాలు చేసే వాళ్ళనిచూస్తే చీదర. వాళ్ళిచ్చేదానికి పదిరెట్లు మనదగ్గర పొగడ్తల రూపంలో పుచ్చుకుంటారు" అన్నాడు దాసు.

"అందరూ అలాంటివారే వుండరు. నూటికి ఏ ఒక్కరో భారీగా ధర్మంచేస్తారు. అలాంటివారితో ఒక్కొక్క సంస్థ దారిద్ర్యం పూర్తిగా తీరిపోతుంది" అంది జానకి, దాన ధర్మాలు చేసేవాళ్ళని సమర్థిస్తూ.

"ఆ. ఆ యిచ్చేవాడు ఏ బ్లాక్ మార్కెటీరో అయి వుంటాడు. పాపం చేసినవాళ్లు వెనక దేవాలయానికి యిచ్చే

వారు. ఇప్పటివాళ్లు సంస్థలకిచ్చి ఇటు కీర్తినీ అటు పుణ్యాన్నీ సంపాయిస్తున్నారు" అంది వాసంతి.

"అన్నీ పెడర్థాలే తీస్తావు నువ్వు! పాపపరిహారంగా ఏ కొందరో యిచ్చినా, చాలామంది తమ విరాళాలవల్ల సంఘాలు బాగుపడతాయనే సదుద్దేశంతోనే యిస్తారు. ఏమంటారు - లక్ష్మణరావుగారూ?" అంది జానకి.

"పాపభీతివల్లయితేనేం, లేక పుణ్యంవస్తుందనే ఆశతోనేం, సంఘంలో కొందరు బాగుపడతారని అయితేనేం, ఏదో విధంగా ప్రతికాలంలోనూ కొంతమంది దయార్ద్రహృదయులు తమ ఆస్తిని యివ్వడం సంఘక్షేమంకోరే ఇస్తారని అనుకుంటే మనకీ తృప్తిగా!" అన్నాడు లక్ష్మణరావు.

"పెద్దపెద్ద ఆస్తులని సంఘాలకోసం యిచ్చేవారు, వారివారి జీవితానుభవాల్నిబట్టి యిస్తారుగాని, సంఘంలో మనుషులు సుఖపడ్తారని యివ్వరు. చుట్టూ పెరిగిన పరిసరాల మీాద కసికొద్దీ అలాచేస్తారు. బయటవాళ్ళ మేలుకోరిచేస్తారా- లేక తమ ఆత్మతృప్తికోసం చేస్తారా అంటే - ఆత్మతృప్తి కోసమే అంటాను. సన్నిహితులూ బంధువులూ లేనివాళ్ళెవరుంటారు? కాని వారిమీాద కసికొద్దీ, వున్న ఆస్తినంతా ఏదో సమాజానికి రాసిన స్త్రీని నే నెరుగుదును" అని డాక్టరు రామారావు అంటూండగా...

"మీ మాటకి అడ్డొచ్చాను. మీ నర్సింగ్ హోమ్‌లో రేణుకాదేవి ఆస్తినంతా సేవాసమాజానికి రాయడానికి కారణం ఏమిటి డాక్టర్?" అంది వాసంతి.

"ఆవిడ్ని గురించి చాలా విచిత్రమైన కథలు విన్నాం. అసలు రహస్యం మీకు తెలిసి వుండాలి చెప్పరూ? మూడు లక్షల రూపాయల ఆస్తి సేవాసమాజానికి రాసిందని పేపర్లో చదివాను. ఆ కథేమిటో చెప్పరూ?" అంది జానకి.

"టూకీగా తేలే కథకాదు. రెండుమూడు గంటలు పడుతుంది" అన్నాడు డాక్టరు.

"చెప్పండి - చెప్పండి" అన్నారు అందరూను.

o o o

నేనూ రాజనూ ఇంటర్ నుంచీ క్లాస్ మేట్సుము. ఇద్దరం చాలా స్నేహంగా వుండేవారం. ఒకేసారి యమ్. బి. పూర్తిచేశాం. నేను హార్ట్ డిసీజీస్‌లో స్పెషలైజ్ చేసి, యిక్కడ నర్సింగ్ హోమ్ పెట్టాను. అతను మద్రాసులో వుండిపోయి అక్కడే ప్రాక్టీసు పెట్టాడు. రాజన్ మళయాళీ; అతను చక్కటి మాటకారి. సంభాషణలో ఛలోక్తులు విసురుతూ, అవతలవాళ్ళని యిట్టే మంచిచేసుకోగలడు. రోగి చెప్పినదే చెప్పినా చిరునవ్వు నవ్వుతుంటూ వినేవోపిక వుందతనికి. డాక్టరుకి మంచి ప్రాక్టీస్ రావాలంటే, మందులకంటే, మాట మంచితనం ముఖ్యం. ఆ కిటుకు రాజన్‌కి తెలుసు.

నన్ను చాలాసార్లు తనతో కలిసి ప్రాక్టీస్ పెట్టమని కోరాడు. కానీ నాకు భీమ్లీ వదిలి వెళ్ళేందుకు మనసొప్పలేదు. గుండె జబ్బున్న నా రోగులకి పట్నపురొద పనికిరాదు. అందువల్ల యిక్కడే వుండిపోయాను. రాజన్ మటుకు సంవత్సరానికి ఒక సారన్నా వచ్చి యిక్కడ వారం రోజులు వుండి వెళ్తూండే వాడు. పట్నంనుంచి కేసులు అప్పుడప్పుడు యిక్కడికిపంపుతూ వుండేవాడు. అతనిదగ్గరనుంచి ఒకరోజున ఓ ఉత్తరంవచ్చింది. ప్రఖ్యాత సినిమాతార రేణుకాదేవి గుండెజబ్బుతో బాధపడు తోందని, ఆమెని తొందరలోనే నాసర్సింగ్ హోమ్‌కి విశ్రాంతి కోసం పంపిస్తున్నాననీ రాశాడు.

జబ్బు బాగా ముదిరేదాకా డాక్టరుకి చూపించుకోక, చివరి ఘడియల్లో పరిగెత్తుకొచ్చే రోగుల్లాంటిదే కదాఅని వూరుకున్నాను. రేణుకాదేవి పేరు ప్రఖ్యాతులుగల సినిమా స్టారని నాకు తెలుసు. అందరికిమల్లే నేనూ ఆవిడ సినిమాలు చూశాను. అన్ని పిక్చర్లూ కాకపోయినా కొన్ని చూశాను. మేము యింటర్ చదువుతుండగా చూసిన కృష్ణలీలల్లో కృష్ణు డిగా వేసిన రేణుక యీమె. ప్రజలీమెకు బ్రహ్మరథం పడు తున్నారని ఏవేవో పేపర్లలోచూసి తెలుసుకున్నాను. ఆవిడ గొప్ప నటీమణిట. ఆమె చిత్రాలకి కనకవర్షం కురిపిస్తుందని మా రాజన్ చెప్పగా విన్నాను.

ఆ మర్నాడు రేణుకాదేవి స్వయంగా ఉత్తరంరాసింది. రాజన్‌వల్ల తన రోగపరిస్థితి నాకూ తెలిసే వుంటుందనీ, వాక

వారం రోజుల్లో వచ్చి, నర్సింగ్‌హోమ్ చూసుకుని, తనకి నచ్చితే రెండుమూడు నెలలు విశ్రాంతి తీసుకుంటాననీ రాసింది. నేను సౌమ్యంగా జవాబు రాశాను. రాజన్ వద్దనుంచిమరొక ఉత్తరం వచ్చింది. ఆమె రాకవల్ల నానర్సింగ్‌హోమ్‌కి పబ్లిసిటీ బాగా వస్తుందనీ, దక్షిణానవున్న బెస్టు కాటేజీ ఆమె కోసం వుంచమనీ, డబ్బుకి సందేహించక్కర్లేదనీ రాశాడు.

రాజన్ ఉత్తరం నాకు కాస్త చికాకు కలిగించింది. నా రోగులందరూ మానసికంగా దుర్బలులు. ఏవిధమైన వుద్రేకం వారికి పనికిరాదు. వచ్చే ఆమె సినిమాతార, అందులో రేణుకాదేవి! ఈహడావుడివల్ల నానర్సింగ్‌హోమ్ ప్రశాంతతకీ, యితర రోగుల ఆరోగ్యానికీ భంగం కలుగుతుందేమో నని అనుమానం కలిగింది. కాని రావద్దని రాయలేకపోయాను. దక్షిణవేపు కాటేజీ, దానిపక్క కాటేజీ రెండూ ఖాళీగా వున్నాయి. రెండూ రేణుకాదేవి రాకకోసం సిద్ధం చేయించి వుంచాను.

రేణుకాదేవి రాకను నేనుఎంత రహస్యంగా వుంచినా యిద్దరు ముగ్గురు రోగులూ, వూరిలో పెద్దలూ ఆమె రాక విషయం ప్రశ్నించారు. అధిక ప్రసంగం వొద్దని రోగుల్ని గదమాయించాను. వూళ్లో వాళ్ళకి ఆమె రాక యింకా నిశ్చయం కాలేదని అబద్ధం చెప్పాను. ఏమైనా నర్సింగ్ హోమ్‌లో ఒక విధమైన అలజడి ప్రారంభం అయింది.

ఆ రోజు సోమవారం అనుకుంటా, పొద్దుట తొమ్మిది గంటలకి నేను రౌండ్సుతిరుగుతుండగా రేణుకా దేవి మెయిల్లో వస్తున్నట్లు వైరొచ్చింది. రౌండ్సు పూర్తిఅయాక దక్షిణ వేపు కాటేజీ ఒకసారి చూసివచ్చాను. హెడ్ నర్స్‌కి ఆ నాడే పేషెంటు రాబోతోందని చెప్పాను.

సాయంత్రం నాలుగు గంటలకి మూడు కార్లతో దిగారు జనం. వారిచుట్టూ వూళ్లో పిల్లా పెద్దా అంతా గుమిగూడారు. నర్స్ వెళ్ళి రేణుకా దేవికి ఆమె కాటేజీ చూపించింది. మూడు కార్లలోని సామానూ, మనుషులూ పక్క కాటేజీలో సర్దుకున్నారు. ఆ సాయంత్రం ఏడుగంటలదాకా ఒక టేహడావుడి. వచ్చేవారూ, పోయేవారు. నర్సింగ్ హోమ్‌లోని పేషెంట్లంతా ఏదో సంబరంలా హడావుడి పడిపోతున్నారు. ఆనాడు యిద్దరు ముగ్గురు పేషెంట్లని చివాట్లు వేశాను.

మర్నాటి రౌండ్స్‌లో ఆమె కాటేజికి గూడా వెళ్లాను. లోపల నలుగురైదుగురు మగవాళ్ళూ, ముగ్గురు ఆడవాళ్ళూ కాఫీలు టిఫెన్లూ తీసుకుంటూ గట్టిగా నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు. వారినిచూస్తే మందు యిప్పించేందుకు వచ్చినట్టుగా నేలేదు. ఏదో పిక్‌నిక్ 'ఎంజాయ్' చేస్తున్నట్టున్నారు. కోపాన్ని దిగమింగుకున్నాను. ఆమెకుకావలసిన సౌకర్యాలు అందినవో లేవో కనుక్కున్నాను. అన్నిటికీ సమాధానం చెప్పింది. జవాబు చెప్పడంలో తలబిరుసుతనం వుండా అనిపించింది. ఈవిడకు మందేమిటి? అనుకున్నాను.

మూడురోజులయింది. రేణుక 'కన్సల్టింగ్ రూమ్'కి రాలేదు, నేను మళ్ళీ కాలేజికి వెళ్ళనూలేదు. నర్సు వాళ్ళకి కావలసిన భోజన సదుపాయాలు చేస్తోంది. అసలు భోజన పదార్థాలూ, పళ్లూ, పాలూ వూళ్ళోనుంచి ఆమెకి ఎక్కి తొక్కి అయేట్టు సప్లయి అవుతున్నాయి. ఎప్పుడూ ప్రశాంతంగా వుండే నర్సింగ్‌హోమ్‌లో ఎంతో అలజడి. ఇద్దరు ముగ్గురు పేషెంట్ల హార్ట్‌బీట్‌లో భేదం కనపడింది. ఎంత పట్టించుకోకుండా ఉందామనుకున్నా ఎలా వీలవుతుంది?

ఆ సాయింత్రం రేణుకతో మాట్లాడి నర్సింగ్ హోమ్ నిబంధనలు తెలియపరిచి, ఆమెవంటి రోగులకిది అనువయిన స్థలం కాదని చెపుదామని నిశ్చయించుకున్నాను.

సాయంత్రం ఐదవుతుంది. నా బంగళా వరండాల్లో పేపరుచూస్తూ కూచున్నాను. రేణుక వంటరిగా, బంగళా కొబ్బరి తోటల్లోంచి వస్తోంది. ఆమె చుట్టూ బాడీగార్డ్సు లేరు. ఏదో పరధ్యాన్నంగా తలవంచుకు నడుస్తోంది. అస్తమించబోయే సూర్యుడు ఆమె బంగారువన్నె శరీరానికి మెరుగు నిస్తున్నాడు. అతి సామాన్యంగా, అలంకారాలు లేకుండా ఉంది. బాబ్ చేసిన జుట్టు వదులుగా బుజాల మీాదకు వేలాడుతోంది. మెళ్ళో రవ్వలహారాలూ, నగలూ, ఏమీా లేవు. ఆ సాయింత్రంవేళ ఆమె దివ్యసుందరమూర్తిలా కనిపించింది.ఆమె వంక రెప్ప వాల్చకుండా చూశాను. ఆ క్షణాన అర్థం

అయింది. ప్రజలు యీ మెక్కై ఎందుకు కనకవర్షం కురిపిస్తారో! వరగేసినతల, సన్నని నడుం, నాజూకయిన ఆ శరీరంలోని వంపులు – అబ్బ! ఏమిటా లావణ్యం – అనుకున్నాను. మొదటిరోజు అవుపడిన అహంభావి యీ రేణుకయేనా అనిపించింది.

నెమ్మదిగా ప్రబంధ కన్యలా నడుస్తూ, వరండా వైపు వచ్చింది. మెట్లు ఎక్కుతూంటే, లేచి కుర్చీ చూపించాను. చివరి మెట్టుమీద నిల్చుని సముద్రంలో క్రుంగే సూర్యుణ్ణీ, పొడుగాటి చెట్లనీడల్నీ, విచ్చే చంద్రకాంతల్నీ వొక్కసారి మునివేళ్ళమీద నిలబడిచూసి నిట్టూర్పు విడిచింది. ఇదికూడా నటనా ? అనిపించింది.

కుర్చీలో కూచుని బంగళాను పరీక్షగా చూసింది. "నేను రేపు బయలుదేరి వెళ్తున్నాను" అంది రేణుకాదేవి. నేను మాట్లాడలేదు. "వచ్చే నెలలో మా వాళ్ళనంతా అక్కడ వొదిలేసి, ఒక్కదాన్నే యిక్కడికి వస్తాను. మందు మాకూ అప్పటినుంచి మొదలుపెట్టొచ్చు. అందుకనే యీ మూడురోజులు హాయిగా తిరుగుతున్నది. ఇప్పుడు వుంటున్న కాటేజీ నాకోసం వుంచెయ్యండి. ఇంకెవ్వరికి యివ్వరుగా! వచ్చేనెల పదిహేనో తేదీకల్లా యిక్కడ వుంటాను. ఈసారి చాలా "క్వయట్"గా వస్తాలేండి. మీ నర్సింగ్ హోమ్‌ని డిస్టర్బ చెయ్యను" అంది నవ్వుతూ.

"మరోమాట. నా కాటేజీకి ముందు పూలమొక్కలు ఏమన్నా వేయించండి. నాకు పువ్వులంటే చాలా యిష్టం. నే

వచ్చే వేళకి పువ్వులు విచ్చుతూండాలని ఆశగావుంది. రేపు మళ్లీ మీరూ నేనూ తటస్థపడమేమో, ట్రీట్ మెంట్ కోసం యిది అడ్వాన్సుగా వుంచండి" అంది వెయ్యిరూపాయల చెక్ బల్లమీద వుంచి.

"మీరు వచ్చాక యిద్దురుగాని !" అన్నాను.

"నేను వస్తానని మీకు నమ్మకంలేదు, ఈ లోపల ఆ కాటేజీ మరొకళ్ళకి యిచ్చి స్తే! డబ్బుయిచ్చాను గనక మీరు అది నాకిందే వుంచుతారు" అంది మొదటిమాటు నామీద దృష్టి నిలుపుతూ.

అబ్బ ! ఎంత చక్కని కళ్ళు. ఆ కళ్ళు కలలతో మూర్ఛలు పోతున్నాయి. వాటిచుట్టూ మటుకు నల్లని రేఖలు. చెక్కిళ్ళు పాలిపోయినట్టున్నాయి.

"డాక్టర్ రాజన్ చెప్పారుగాని యింతఅందమైనప్రదేశ మని అనుకోలేక పోయాను. పూలచెట్లు వేయిస్తారుగా నే వచ్చే వేళకి" అంది లేచి నుల్చుని.

నమస్కారంచేసి మెట్లుదిగింది. భారంగా నడుస్తూ నర్సింగ్ హోమ్ వైపు వెళ్ళింది రేణుక. టేబుల్ మీద చెక్కు గాలికి ఎగిరి నా గుండెమీద కొట్టుకుంది.

o o o o

మరుసటి నెల పధ్నాలుగో తేదీ సాయంత్రం ముగ్గురు మొగవాళ్లూ, నలుగురు ఆడవాళ్లూ యిద్దరు పిల్లలూ రేణుకా

వచ్చారు. వారివెంట యిద్దరు మొగవాళ్లూ వొక ఆడవాళ కూనూ.

పూర్వమంత హడావుడి లేకపోయినా, ఆ ఛాయలు మటుకున్నాయి. ఈ సారివూళ్లోవాళ్ళు ఎక్కువ రాకపోయినా రేణుకతో వచ్చినవారు మాత్రం రోజూ బయటకు వెళ్ళి వస్తూండేవారు. వచ్చిన మర్నాడే రేణుక కన్‌సల్టింగ్ రూమ్‌కి వచ్చింది. తనతో వచ్చినవారు వెళ్ళిపోయాక మందు మొదలు పెడ్తాననీ, అంతవరకూ ఆగమనీ అడిగింది.

ఎన్నాళ్ళుంటారని నేనుఅడగలేదు; రేణుక చెప్పలేదు.

రెండ్రోజుల్లో రేణుక కాటేజీలోకి వెళ్లాను. ఆ వేళకి హాల్లో మెంబర్లందరూ వున్నారు. రేణుక తన భర్తనీ, బావ గార్నీ, అన్నగార్నీ పరిచయం చేసింది. అందరూ తెలివిగల వాళ్ళేననిపించింది. అటుతర్వాత రేణుక తన తల్లినీ, వదిన గారినీ, నాకు చూపించింది. ఇద్దరూ వింతంతువులు. రేణు కని నాచేతుల్లో వుంచినట్టు, ఆమె ఆరోగ్యానికి నేనుబాధ్యుణ్ణి అయినట్టు మాట్లాడారు. అప్పగారూ, వదినగారి కూతు రూటు, యిద్దరూ రేణుకంత అందగత్తెలు కాకపోయినా చక్కని వారనక తప్పదు. అందరూ రేణుక ఆరోగ్యం గురించి ఆదుర్దా కనపరుస్తూ మాట్లాడారు. నాకు చేతనయినంత సహా యం జేస్తానని మాటయిచ్చాను.

వచ్చిన నాలుగోరోజున రేణుక భర్తా, బంధువర్గమూ నా ఆఫీసుకి వచ్చారు, వాళ్ళు వెళ్ళిపోతున్నట్టు చెప్పేందుకు.

"అమ్మాయిని మీ చేతుల్లో వుంచాము. దానికి కాస్త ఎలా వున్నా తెలియపర్చండి, వచ్చి వాల్తాము. అసలిక్కడ నేను వుంటానంటూంటే, వద్దంటోంది. కోడలికి పురిటిరోజులు. లేక పోతే వుందును" అని కంటనీరు పెట్టుకుంది రేణుకతల్లి.

"ఏం ఫరవాలేదు. తొందరలో నయం అయిపోతుంది. విశ్రాంతి కావాలామెకి. మీరేమీ భయపడకండి" అన్నాను.

రేణుకభర్త తెల్లగా పొడుగ్గా వున్నాడు. తెలివిగల వాడు, "నే నిక్కడుండి చేసేదిలేదు. అక్కడ చూచుకోవా ల్సిన వ్యవహారం చాలాఉంది. తన ఆరోగ్యస్థితి రేణుక రాస్తూ వుంటుంది, మీరుగూడా కనీసం మూడురోజులకన్నా ఒక జాబు రాయండి. యీ జబ్బుతో ఎక్కడ ప్రోగామ్సు అక్కడ కాన్సిల్ చేసుకుంది. మీకు తెలుసుగా ఆవిడ గురించి!" అని శలవు తీసుకున్నాడు. ఎంత అదృష్టవంతురాలు రేణుక ! ఇంత ప్రేమించే ఆత్మీయులు - అంత ఆరాధించే ప్రజలు.

ం ం ం ం

అంతా వెళ్ళిపోయారు. పనిచేసేమనిషి దగ్గరనుంచీవెళ్ళి పోడం నాకు ఆశ్చర్యం కలిగించింది. తల్లినికూడా వద్దని తన తాలూకు మనుషుల్ని ఒక్కరినికూడా వుంచకుండా పంపించి వేయడం నాకు వింతగా తోచింది. వారు వెళ్ళిపోయిన మర్నాడు రేణుకని పరీక్ష చేశాను. ఆమె గుండెలస్థితి బాగా లేదు. మహా అయితే ఆరునెలలు బతకవచ్చు. ఏమో చెప్ప

లేం-చాలారోజులు తీసుకోనూవచ్చు. అన్నిటికంటే మాన సికంగా విశ్రాంతి అత్యవసరం.

"మీరు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి. మూడు నెలలపాటు హాస్పిటల్ గేటు దాటకుండా వుండాలి. యిక మానసికంగా కూడా విశ్రాంతి కావాలి. దైహికంగా శక్తికలి గేటట్లు నర్సింగ్ హోమ్ చూసుకోగలదు. మానసిక శక్తికి ఆలోచించకుండా వుండటమే మందు. మీరిక్కడాను, మనసు మద్రాసులోనూ కాకూడదు" అన్నాను డాక్టరు ధోరణిలో.

"ఇన్నాళ్లకి మానసిక విశ్రాంతి తీసుకొనే అవకాశం చిక్కిందిగదా అని నేను సంతోషిస్తూవుంటే! చక్కగా చెట్లనీ సముద్రాన్నీ చూడక షూటింగుల గురించి ఆలోచిస్తానను కుంటున్నారా? అయితే మీరు నాగురించి పొరపడ్డారు. నన్ను వొంటిగామటుకు తోటలో తిరగనివ్వండి. అంతేచాలు" అంది రేణుక.

"మరీ అలసట కలిగేటట్లు తిరక్కుండా వుండండి" అన్నాను.

నెల్లాళ్ళు గడిచాయి. రేణుకలో కొంచెం గుణం కని పిస్తోంది. నర్సింగు హోమ్‌లోని రోగులకి ఆమెను గురించి అభి లాష తగ్గిపోయింది. పొద్దున్నప్పుడు రేణుక, పక్కమీదనుంచి లేవలేని రోగులవద్ద కూచుని, ఖబుర్లాడుతుండేది. వాళ్లతో చాలా చనువుగా కలిసిమెలిసి వ్యవహరించేది. నర్సింగుహోం

లోని సిస్టర్సూ, రోగులూ, యీామెని సినిమా తారగా మర్చి పోయి, వాళ్ళలో వొక దానిగా చూసుకొనేవారు.

కొత్తగా విచ్చిన పువ్వుల్ని చూసి ఎంతో ఆనందిం చేది, ఆవార్తని ప్రతిరోగికి, ఆఖరికి నాదగ్గిరకుకూడా జేరేసేది.

ఒకనాటి సాయంత్రం నేను కొబ్బరి తోట వైపుకు వెళ్ళాను. దూరాన రేణుక కొబ్బరిచెట్ల నీడనున్న రాతిబండ మీద కూచునుంది. చెంపని అరిచేతుల్లో వుంచుకుని దీక్షగా సముద్రపు అలలిని చూస్తూ కూచునుంది. నేను నెమ్మదిగా వెళ్లాను ఆమెవైపు. అడుగుల చప్పుడుకి వులిక్కిపడి వెనక్కి తిరిగింది రేణుక.

"మీరా-ఎవరోనని భయపడ్డాను. ఇక్కడ ఎంత ప్రశాంతంగా వుందో చూశారా? మందాకిని వడ్డున కూచు న్నట్టు కలగంటున్నాను" అంది.

"యీ సముద్రం మందాకిని అవునో గాదో నాకు తెలీదుగాని, మీరు మటుకు మందాకిని ఒడ్డునుండే అప్సరసకి సిగ్గు తెప్పిస్తున్నారు" అన్నాను.

రేణుక ముఖం చిట్లించుకుని "అలాటి పొగడ్తలతో నాచెవులు చిల్లులు పడివున్నాయి" అంది.

"ముఖస్తుతికాదు. నిజం-మనస్ఫూర్తిగా చెప్తున్నాను."

నామాట నమ్మిందో లేదోకాని, 'ఇంత అందమయిన ప్రదేశాన్ని ఎలా సంపాయించారుడాక్టర్ ?'అని ప్రశ్నించింది.

"కొన్ని వేలరూపాయలతో" అన్నాను.

రూపాయలతో యింత అందాన్నీ, ప్రశాంతతనీ కొనగలగడం ఎంత అదృష్టం. ఇలాటి వస్తువులు అదృష్ట వంతులే కొనగలుగుతారు" అంది రేణుక.

"డబ్బుతో ఏవేవికొని అనుభవించగలరో మీకంటే ఎవరికెక్కువ తెలుసు!"

"డబ్బువల్ల ఏవేవి అనుభవించలేమో, డబ్బు ఏ స్వేచ్ఛందతని దూరంగా తోలి పారెయ్యగలదో నాకు తెలిసి నంత బాగా మరొకరికి తెలీదు. ఈలాటి ప్రశాంత ప్రదేశంలో, ఒక పదిరోజులపాటు గడపగలుగుతానని కల్లోగూడా అనుకోలేక పోయాను" అంది రేణుక.

"మీకు మద్రాసుమీదా అక్కడి మనుషులమీదా బెంగగా లేదూ?"

ఇంత చక్కటివేళ మీకు మద్రాసే జ్ఞాపకంరావాలా? నేను వేటినుంచి దూరం అవుదామని చూస్తున్నానో అవి మీరు జ్ఞాపకం చేస్తారెందుకు!" అని ఏదో చెప్పబోయి ఆగి పోయింది.

నాకు అర్థంకాలేదు. రేణుక ముఖాన్నిబట్టి ఆమె కల వరపాటు గ్రహించాను.

మాట తప్పించాలని "నర్సరీనుంచి గులాబీ అంట్లు తెప్పిస్తున్నాను. ఎక్కడ వేయించమన్నారు?" అని అడిగాను.

రేణుక పువ్వులతో లోకాన్ని మర్చిపోగలదు.

"నా కిటికీ కిందగా వేయించండి. నిద్రలేచే వేళకి విచ్చినగులాబీ నన్ను పలకరిస్తుంది" అంది రేణుక.

"అయితే మీరు ఎల్లకాలం యిక్కడే వుండేటట్టు మొక్కలూ అవీ నాటిస్తున్నారు. యింక మీరు వెళ్ళరా!" అన్నాను, నీ రెండలో ఆమె మెడ మెరుస్తూండగా.

o o o

అన్నిటికన్నా, వొకవిషయం నాకు బోధపడేదికాదు. క్షణంగూడా తీరికలేకుండా షూటింగుల్లో-స్నేహితులమధ్యా గడిపే రేణుక యీ ప్రశాంత వాతావరణానికి ఎలా సర్దుకుపోయిందా-అని ఆశ్చర్యపోయేవాడిని. ఈ పరిసరాల్లోనే తను పుట్టి పెరిగినట్లుగా ప్రవర్తించేది. ఆఖరికి పేపరన్నా చూసేదికాదు. ఒక్కొక్కనాడు చింపకుండావున్న కవర్లు టేబుల్‌మీద కనపడేవి నాకు. భర్తకిమటుకు నేను మాట యిచ్చిన ప్రకారం మూడురోజులకో జాబు రాసేవాడిని, అతనూ జవాబు రాసేవాడు.

ఇలా ఉండగా ఒకనాటి సాయంత్రం ఆమెభర్త రైలు దిగాడు. అతను వస్తున్నాడని నాకు తెలియదు. రేణుకకుకూడా తెలీదనే అనుకుంటా. రెండురోజులున్నాడు, ఆ రెండురోజుల్లో ఎంతో మారిపోయింది రేణుక. ముఖంలో చిరునవ్వు మాయమయింది. అనారోగ్య లక్షణాలు స్పష్టంగా కనపడ్డాయి.

ఎఱ్ఱనికళ్ళు మానసిక బాధని వ్యక్తంచేసేవి. నెమ్మదిగా కోలు కుంటున్న మనిషి యిలా అవడం నాకు చాలా ఆదుర్దా కలిగించింది.

ఆ మూడోనాడు పొద్దుట అతను నా ఆఫీసు గదికి వచ్చాడు. "రేణుకని తీసుకెళ్ళి పోదామని అనుకుంటున్నాను" అన్నాడు.

"ఏం?" అన్నాను ఆశ్చర్యంతో.

"మీరు మరోలా అనుకోకండి-తీసుకెళ్లాలి" అన్నాడు నిశ్చింతగా.

అతనితో రోగలక్షణాల గురించి చర్చించటం యిష్టం లేక "అది మీయిష్టం. రేణుకవస్తే తీసుకెళ్ళండి. కానిరోగిని మధ్యలో పంపే అలవాటు నాకులేదు. కాదని మీరు ఎదిరించి వెళ్ళిపోయారా, నాపూచీలేదు" అన్నాను! నేను ఖచ్చితంగా.

ఆవేళ రెండుగంటలకి రేణుక భర్త నాకు చెప్పకుండా వెళ్ళిపోయాడు. ఆ సాయంత్రం దీపాలవేళ షికారు వెడుతూ రేణుక విరుచుకు పడిపోయింది. చేతుల్లో పట్టుకొని కాటేజీకి తీసుకొచ్చారు. ఆరాత్రి చాలా ఖంగారుపడ్డాను. అతని రాకకీ యీామె పరిస్థితికీ ఏదో సంబంధం వుందని రూఢయింది నాకు. లేకపోతే యిన్నాళ్ళబట్టీ లేంది యెందు కివాళే విరుచుకు పడుతుంది?...

ం ం ం ం

## ౨

రాత్రి పదిగంటలకి రేణుక మన మనుష్యుల్లో పడింది. ద్రాక్షరసం పట్టాము. "మీవాళ్ళకి వైర్ యిస్తాను" అన్నాను రేణుకతో.

"అక్కర్లేదు—ఆపనిమటుకు చెయ్యకండి. ఈ రాత్రికి పోతానేమోనని మీకు భయంకదూ—యింకా వుంటాలెండి. ఏమయినాసరే, మా వాళ్ళకు వైర్ మటుకు యివ్వకండి" అంది నీరసంగా నవ్వుతూ రేణుక.

ఆ రాత్రి నర్సువున్నా, తెల్లవార్లూ నేను పక్క దగ్గిరే కూచున్నాను. ఆమె మృత్యుముఖంనుంచి బయటపడ్డా, పక్క వదిలి వెళ్ళ బుద్ధిపుట్టలేదు. నర్సు పక్కగదిలో నిద్దరపోతోంది. రేణుక మంచానికి పక్కగా వాలుకుర్చీలోకూచున్నాను. సన్నని దీపపు వెలుగు ఆమె రెప్పలమీద పడుతోంది. మూసినకళ్ళు ముత్యపు చిప్పల్లా వున్నాయి. నుదుటి మీద స్వేదబిందువులు మెరుస్తున్నాయి. నావైద్యానుభవం ఆమె యింకెన్నాళ్ళో బతక దని చెప్తోంది.నాహృదయమా వేదనమటుకు ఆమెని బతికించాలని.

కాసేపటికి రేణుక-వులిక్కిపడి కళ్ళు తెరిచింది. నెమ్మ దిగా పక్కనెళ్ళి నిల్చున్నాను. ఫాన్ గిర్రున తిరుగుతోంది. "భయంగావుంది చెయ్యి పుచ్చుకోరూ?" అంది. ఆమెచేతుల్ని నా చేతుల్లోకి తీసుకున్నాను. రేణుక బెదిరినలేడిలా చూస్తోంది నలుపక్కలా. "మంచినీరు కావాలా?" అని అడిగాను.

అప్పుడు గుర్తుపట్టింది నన్ను. "మీరింకా యిక్కడే వున్నారా?" అని ఆమె ప్రశ్నించింది.

"కాస్త యీ రసం తాగండి" అన్నాను, ద్రాక్షరసం చెంచాని నోటిదగ్గిరకు తెస్తూ.

"నర్స్‌ని పిలవండి. పాపం మీకు శ్రమగదూ—వెళ్ళి పడుకోండి" అంది రేణుక.

"ఫరవాలేదు. ముందు రసం తాగండి" అన్నాను. రేణుక పక్కమీదకూచుని ఒక్కొక్క చెమ్చా రసం పోశాను. ఒక ఔన్సు తాగాక చాలునంది రేణుక.

రసం తాగాక గ్లాసు టేబిల్ మీద పెట్టి అలాగే కూచుండిపోయాను. నేను చేసిన పరిచర్య మేము వూహించుకోనంత దగ్గిరగా తెచ్చింది మమ్మల్ని.

రేణుక నా వడిలో చెయ్యిపెట్టుకుని వత్తిగిలి పడుకుంది. నేను ఆమె ముంగురులు పైకిలీసి చెమట బిందువుల్ని తుడిచాను, కొన్నిక్షణాలుపోయాక, "మీరు యిలాగే కూచుంటే, నేను హాయిగా నిద్దరపోతాను" అంది రేణుక.

"మీరు నిశ్చింతగా పడుకోండి. కాని మూడు గంటల కొకసారి రసంతాగటానికి లేపుతాను. అంతే" అన్నాను ఆమె పాలమీగడ చెక్కిళ్ళని నిమురుతూ.

"ఎన్నాళ్ళయింది—యిలా హాయిగా పడుకుని. అసలు ఎప్పుడన్నా, యిలా నిశ్చింతగా పడుకొని ఎరుగుదునా!

బహుశా చిన్నపిల్లప్పుడు అమ్మఒళ్ళో యిలా పడుకున్నానేమో —" అంటూ కళ్ళుమూసుకుంది.

ఆ నిద్రపొయ్యే ముఖాన్ని చూస్తూ కూచున్నాను, భళ్ళున తెల్లవారేదాకా. ప్రత్యూషపవనాలు రేణుక చెక్కిళ్ళు తాకేవేళ, ఆమెని నర్సుకి వప్పజెప్పి, నా బంగళావైపుగా నడిచాను.

కాళ్లు సముద్రపుటొడ్డుకు లాక్కెళ్ళాయి. ఆ వుదయపు వేళ ప్రకృతి అతి మనోహరంగా వుంది. రేణుక యీ ఉదయాన్ని చూసి ఎంత ఆనందించేదో. ఏది ఎట్లయినా రేణుకని చనిపోనివ్వకూడదు. ఆమె మనసులోని ఆందోళననీ, బాధనీ నేను పోగొట్టాలనుకున్నాను.

'రేణుక ఎవరు? ఎందుకు రేణుకని గురించి తనకీ ఆలోచనలు? నిజానికి రేణుక బంగారు పంజరంలోని చిలుకా? సర్వసంపన్నురాలైన ఆమెకు ఎలాటి పంజరం వుండటానికి ఆస్కారం ఉంది?' అని రకరకాల ఆలోచనలు వచ్చాయి.

రౌండ్సులో నేను వెళ్ళేసరికి రేణుక యింకా నిద్రలేవ లేదు. నర్సుని పంపివేశాను. అయిదు నిమిషాల అనంతరం రేణుక నిద్దర లేచింది. ఆమెకళ్ళు మహా సముద్రాలుయీది, యుగయుగాల్లోకి చూసి అలిసి సొమ్మసిల్లి నట్లున్నాయి. పక్కనే కూచుని మొహం కడిగించి ద్రాక్షరసం యిచ్చాను.

"మీరు పక్క మీంచి లేవకూడదు. కదలకుండా పడుకోండి. నేను పేషంట్లని చూచివస్తాను"

"తొందరగా వస్తారా" అన్నట్లు చూసింది.

"అరగంటలో వస్తానని" చెప్తూ బయటకొచ్చాను.

ఒకరాత్రిబాధతో ఆ మెకళ్ళలోని వెలుగు మాయమై పోయింది. వాటిలో వైరాగ్యం పుట్టిపడుతోంది. ఆకళ్ళలోకి తిరిగి కాంతివస్తేగాని ఆమె కోలుకోదు.

నేను తిరిగివచ్చాను. రాగానే రేణుక మొదట వేసిన ప్రశ్నయిది. "మా వాళ్ళకి రాత్రి వైర్" ఇచ్చారా ?

"లేదు. మీరు వద్దని అన్నారుగా—అందుకని యివ్వ లేదు. యీపూట యిమ్మన్నారా—యిస్తాను" అన్నాను.

"నన్ను "మీరు" అని మన్నించడం మానెయ్యండి. వాళ్ళకి వైర్ యివ్వకండి. నేనెంత అపాయంలోనున్నాసరే వాళ్ళకి టెలిగ్రామ్ యివ్వడం అనవసరం" అంది రేణుక.

నేను ప్రశ్నార్థకంగా చూశాను.

రేణుక దగ్గరకు రమ్మనమని సంజ్ఞజేసింది. "పదిరోజు లలో పోయేనేను...వాళ్ళువస్తే రెండురోజుల్లోనే గుటుక్కు మంటాను. నేను త్వరగా దాటిపోవాలనివుంటే వాళ్ళని రప్పిం చండి." అంది రేణుక నా వళ్లో చెయ్యివేసి.

"అదేమిటి రేణుకా ?" అన్నాను.

"వాళ్లు నా చావుకోరేవాళ్ళు. నాచివరి రోజులునిశ్చిం తగా గడపడం మీకిష్టంలేదా ? అలాఅయితే, పిలిపించండి" అంది రేణుక ఆమె కంటినీరు చెంపలమీదకు జారుతుంటే.

"తప్పు ! ఫూరుకో. నీకిష్టంలేకపోతే వాళ్ళకెంత మాత్రమూ తెలియనివ్వను. నీకు వాళ్ళని చూడటం యిష్టం లేకపోతే గేట్లోనించే మెడబెట్టి గెంటిస్తాను. హాయిగా పడుకో. నీ కొచ్చిన భయం ఏమీలేదు. నువ్వు శుభ్రంగా లేచితిరుగు తావు. నీ గురించి, నీ కంటెనాకే ఎక్కువ తెలుసు. నువ్వు నిర్భయంగావుండు" అన్నాను రేణుకతో.

"చావంటే నాకుభయం అనుకున్నారా? అయితేమీరు పొరపడ్డారు. మృత్యువు కంటే నాకు ఆప్తులెవరు? దానికోసం నేను చాలాకాలంగా ఎదురుచూస్తూకూచున్నాను. ఎటొచ్చీ చివరి ఘడియలతో, అనురాగంలో కాకపోయినా — సాను భూతితో అన్నాచూసే ప్రాణి పక్కన వుండాలనే కాపీనం నా కింకా పోలేదు. "అయ్యో" అనికన్నీళ్ళు కార్చేవారు లేకుండా ఆఖరిసారికన్నుమూయడం ఎంతకష్టమో మీరువూహించుకో గలరా ?"

"నీమనసు బాగాలేదు. కాసేపు విశ్రాంతి తీసుకో. తర్వాత మాట్లాడుకుందాం"

"మీకర్థం కాదు. నాజీవితంలోకల్లా విశ్రాంతిసమయం యిదిపక్కటే. నేనిప్పుడు విశ్రాంతి తీసుకుంటున్నాను. అసలు రేణుక మీకు తెలియదు. మీరునాగురించి మరుపు తెరుపుల్లో ఆలోచించు కుంటున్నారు. పోనీలెండి, పడుకుంటున్నాను, మీరు మటుకు యిక్కడే వుండండి." అని కళ్లు మూసుకుంది. కాని శ్వాసవలన ఆమె నిద్రపోవడంలేదని తెలుస్తూనేవుంది.

రేణుక మాటలు నన్ను కలవరపెడుతున్నాయి. యీ పుత్తడి బొమ్మలోపల యింత అగ్నిభాండమా ? రేణుక ఎందు కింత నిరాశచెందుతోంది? మృత్యువుని రెండుచేతులా ఎందు కిలా ఆహ్వానిస్తోంది? జీవితంలోఆమెనిఎవరూ ప్రేమించ లేదా? లక్షలాది ప్రజలు ఆరాధించే రేణుకకు"ప్రేమ"అంటే తెలీదో? ఏవేవో ప్రశ్నలు బుర్రలో తిరుగుతున్నాయి.

"పాపం నావల్ల మీపని పాడయిపోతోంది, కాని మిమ్మల్ని పంపలేకుండావున్నాను. నిదురలేకుండా - కళ్ళు మూసుకుపడుకుంటే, నామనసుఏవేవో ఆలోచనలతో గాబరా పడుతుంది. మీరు పక్కనుంటే ధైర్యంగావుంటుంది" అంది రేణుక కళ్ళు తెరచి.

నాకు సమాధానానికి మాటలు కనపడలేదు.

"మృత్యువులంటే మనుష్యులు దడుస్తారట" అని యిం కేమిటో అడగబోయింది రేణుక.

"నువ్వు మృత్యువుని జపమాలలావుచ్చరిస్తూవుండటం ఏం బాగాలేదు. నీకా ధర్మసందేహాలన్నీ ఎందుకు ? నువ్వు మళ్లీ సుఖంగా వుంటావు" అన్నాను కేకలేస్తున్నట్టు.

నాకు చావంటే భయంలేదు, అసలు బతకాలనే కోరిక కూడా లేదు. అందుకే మనుషులు మృత్యువుకి భయపడతా రంటే, ఆశ్చర్యంగా వుంటుంది నాకు. అసలు నన్ను బతికి ఏం చెయ్యమంటారు, చెప్పండి?"

"అందరూ ఎందుకు బతుకుతారు ? అందుకే నువ్వూ బతుకు."

"అందరూ అంటే-వారికి జీవితంమీద మమత, చుట్టూ వున్న వారిమీద ప్రేమ, అన్నిటినీమించి వారికి జీవించడంలో ఒక ఆనందం కనిపిస్తుంది—అందుకని వారు బతుకుతారు."

"నువ్వూ అలాటివాటికే బతుకు, నిన్ను ఆరాధించే ప్రజలు, చుట్టూ స్నేహితులు, నీచుట్టాలూ-వీరందరి కోసం బతుకు" అన్నాను.

"మీరు, పిచ్చివారు. నాలాగాజీవించివుంటేమీకు తెలిసేది-జీవితంఅంటే ఎంతటి కాలకూటవిషమో — నాభర్తా, చుట్టాలూ వీరంతా నన్ను ప్రేమిస్తున్నారని మీభ్రమ. వారు నన్నుకాదు ప్రేమిస్తున్నది. నా ధనాన్ని.

"నీ కోసం నువ్వు బతకటం నేర్చుకో" అన్నాను.

"నాకోసం నేను బతకటం పన్నెండేళ్ళక్రితమే మానేశాను. ఎవరికోసం వారు బతుకుతారు-అనేఆలోచనే మర్చిపోయాను. కొన్నాళ్ళు మాకుటుంబంకోసం, కొన్నాళ్ళు భర్త కోసం, కొన్నాళ్ళు ప్రేక్షకులకోసం, కొన్నాళ్లు అందరికోసం-చనిపోయే అవకాశం లేక బతికి వునాను." అంది రేణుక నిర్లక్ష్యంగా నవ్వుతూ.

"పోనీ, నాకోసం బతుకు, రేణుకా, నేనంత చెడ్డవాణ్ణి కానుగా—మంచివాడినేలే, అంచేత నాకోసం బతుకు. నేను

నిన్ను ప్రేమిస్తున్నాను. మనిద్దరం మనుషులు లేనిచోట చిన్న కుటీరం కట్టుకు, దానిముందు పూలమొక్కలు వేసుకొని వాటిని చూసుకుంటూ బతకగలం" అన్నాను ఉద్రేకంతో.

"ఎంత అమాయకులండీ మీరు? మీ ప్రేమవల్ల నన్ను బతికించుకోవాలని మీకుంది. నాకు బతకాలనిపించినా, నాప్రేమ మిమ్మల్ని మురికిలోకి లాగుతుంది. పూర్వం నన్ను నా కోసంగా ప్రేమించినవాడు రూపులేకుండా పోయాడు. ఆ పొరబాటు యింకా చేస్తానా? నాప్రేమ నాశనహేతు వవుతుంది. పాపం - మా వాళ్ళ సంగతి మీకు తెలియదు. అందుకని అలా అంటున్నారు" అంది రేణుక.

"మనిద్దరికీ ఏవీ అడ్డురావు. మీవాళ్ళందర్నీ నేను ఎదిరిస్తాను. కోర్టుకోర్టుకీ వెళ్ళి నిన్ను గెల్చుకుంటాను" అన్నాను.

"చాలా రోజుల్నుంచి చుట్టూవున్న వాళ్ళతో పోరాడి అలసిపోయాను. యింక వోపిక లేదు. యీ జీవితమింక అస్తమించనివ్వండి" అంటూ రేణుక యిలా చెప్పుకొచ్చింది.

o o o

నాన్న పోయేసరికి పన్నెండేళ్ళు నాకు. తమ్ముడికి ఆరేళ్లు. అక్కకి పెళ్ళయి ఏడాది తిరక్కుండా నాన్న పోయారు. అన్నయ్యకి పదహారేళ్ళుంటాయి. నాన్న మార్వాడీకొట్లో పద్దులు రాస్తూండేవారు. మాకు ఆస్తిపాస్తుల్లేవు. కాని ఆయనకు వంశపారంపర్యం పూర్వులిచ్చిన గుండెజబ్బుమటుకూ

మిగిలింది. చాలీచాలకా సరిపెట్టుకుంటూండేవారు, నాన్న వచ్చే ఆ ముప్ఫైరూపాయల్ని.

అక్కయ్య ఎదిగి యింట్లో కూచుంది. తమ్ముడూ నేనూ - అన్నయ్యకి చదువబ్బలేదు. ఎటుచూసినా పాపం - యీ సంసారం ఎలా కడతేరుతుందో అర్థం అయేదికాదు ఆయనకి. దానికితోడు గుండెజబ్బు. తను ఏ నిద్దట్లోనో కళ్ళు మూస్తే-పిల్లల గతేంగాను? రాత్రి పగలూ నాన్నకిదే ధ్యాస. అక్కయ్యపెళ్ళి మరో సమస్య. పిల్ల బాగావున్నా ఎవరు చేసుకుంటారు? నాన్న వీళ్ళకాళ్లూ వాళ్ళకాళ్లూ పట్టుకుని - స్కూలుఫైనలు పాసయిన అల్లుణ్ని తీసుకొచ్చారు. అల్లుడికి అయిదువందలూ, పెళ్ళికి అయిదువందలూ అప్పుచేసి ఎల్లాగో పెళ్ళి అయిందనిపించారు.

అప్పుతీర్చేదారి తెలీక - ఎదిగినపిల్లల్ని పోషించలేక మంచమెక్కి నాన్న అక్క పెళ్ళయిన ఆర్నెల్లకి, ఒకనాడు నిద్దట్లో గుండె ఆగిపోగా, యీ కష్టాల్ని దాటి వెళ్ళిపోయారు.

యింక మిగిలింది అన్నయ్య, అమ్మా, తమ్ముడు, నేనూ; మాతోపాటు వెయ్యిరూపాయల అప్పు. చిన్నప్పటి నుంచి యింట్లో అందరికంటే నేను చాలా చక్కగా వుండే దాన్ని. ఇద్దరు ముగ్గురు రెండో పెళ్ళివాళ్ళు వెయ్యో పదిహేనొందలూ ఎదిరిచ్చి నన్ను కొనుక్కోచూశారు. ఎందువల్లనో అమ్మ నన్ను అమ్మకపోయింది!

మా యింటిపక్కనున్న కామాక్షి నన్ను పెంచుకో డానికి అమ్మని అడిగింది. కామాక్షికి గుర్రపు పార్టుకూడా ఉండేది. కాని మర్యాదస్తులెవరూ ఆమెతో మాట్లాడేవారు కారు. "నాకు సాయంగా ఉంటుంది; మంచి వరుణ్ని వెతికి, పెళ్ళిచేసి కూతుర్నీ అల్లుణ్నీ యింట్లో పెట్టుకుంటాను" అనేది అమ్మతో కామాక్షి.

ఒకనాడు నేను కామాక్షి యింటికి వెళ్ళాను. ఆ వేళప్పుడే వారింటికెవరో పెద్దమనుషులు వచ్చారు. వారిదగ్గర నన్ను పాట పాడమంది కామాక్షి. నాకు చెడ్డ సిగ్గేసింది. పాడకపోతే అమ్మతో చెప్పి కొట్టిస్తుందేమోనని పాడాను.

మర్నాడు కామాక్షి అమ్మతో అంది. "నిన్న మా యింటికొచ్చిన పెద్దమనుషులు రేణుకని చూశారు. పాటకూడా పాడించి విన్నారు. వాళ్ళకి నచ్చింది. వాళ్ళు 'కృష్ణలీలలు' సినిమా తీస్తున్నారట. అందులో కృష్ణుడి వేషంకోసం చక్కని ఆడపిల్ల కావాలని వెతుకుతున్నారు. మన పాపాయిని మీరు పంపుతారేమోనని అడిగేందు కొచ్చాను."

"సినిమాల్లోకా?" అంది అమ్మ తెల్లపోయి.

"మీరు దానికోసం భయపడకండి. వారు చాలా పెద్ద మనుషులు. మంచి మర్యాదయినవారు. నేను చాలా రోజు ల్నించి వాళ్ళ కుటుంబాన్ని ఎరుగుదును. నెలకు 75 రూపాయల

చొప్పున, ఏడాదిపాటు అమ్మాయికి జీతం ఇస్తారట, పట్నం తీసుకెళ్ళి. మీరుగూడా వెంట వెళ్ళి కాపరం పెట్టండి. ఇక్కడుండి ఏం చేస్తారు?" అంది కామాక్షి అమ్మతో.

నెలకి 75 రూ. చొప్పున ఏడాదిపాటు యిచ్చేటట్టు ఒప్పుకొని, మా కందరికీ టిక్కెట్లు చార్జీలుపెట్టి పట్నం తీసుకెళ్ళారు ఆ వచ్చిన పెద్దమనుషులిద్దరూనూ.

ఆఫీసులో, స్టుడియోలో అందరూ నన్ను చాలా ఆదరణతో చూచేవారు. నాకు పదమూడేళ్లు దాటుతున్నా చాలా చిన్నపిల్లని చూసినట్టు వాత్సల్యంలో చూసేవారు.

ఆ ఏడాది బాగానే గడిచింది. తమ్ముణ్ని స్కూల్లో వేశాము. అన్నయ్యకి చదువులేదు, తీరిక అసలేలేదు. అక్కయ్యకీ మాకూ నేను సినిమాల్లో చేరడంతో రాకపోకలు తెగిపోయాయి. మూడుపూట్లా శుభ్రంగా భోంచేసేదాన్ని. షూటింగ్ వున్నప్పుడు స్టుడియోకారు మా యింటిముందు వచ్చి ఆగేది. జీతం అమ్మగానీ అన్నయ్యగానీ తీసుకునేవారు. పట్నం వచ్చినకొత్తలో అమ్మ నాకు మూడుజతల పరికిణీలు, జాకెట్లూ, వోణీలు కొంది. పిక్చర్ పూర్తిఅయేదాకా-నేను ఆ బట్టల్తోనే గడుపు కొంటుండేదాన్ని. కృష్ణలీలలు సినిమా అందరికీ చూపించే రోజున మటుకు మా ప్రొడ్యూసరు నాకో సిల్కు పరికిణీ, జాకెట్టూ, వోణీ కొని యింటికి పంపారు. అవి కట్టుకొని వెళ్ళాను సినిమాకి.

కృష్ణలీలలు పిక్చర్లో నా యాక్టింగ్ చూసి ప్రజలు మెచ్చుకున్నారు. నన్ను సినిమాల్లోకి తీసుకునేందుకు, చాలామంది మాయింటికొచ్చారు. కాని మా పాత ప్రొడ్యూసరే నెలకి నూటయాభై యిచ్చి, మరో యేడాదికి కంట్రాక్టు రాయించుకున్నారు.

మా ఆర్థికస్థితి కాస్త చక్కబడింది. అమ్మ నాకు గాజులూ, మెళ్ళో గొలుసూ చేయించింది. అన్నయ్య సిగరెట్లు తాగటంలోకి వచ్చాడు. తమ్ముడు కాన్వెంటులో చేరాడు. డబ్బువిషయంలో నేనెప్పుడూ కల్పించుకునేదాన్ని కాను. రెండుమూడుసార్లు డబ్బుకోసం అన్నయ్యా, అమ్మా ఘర్షణ పడటం మటుకు నా చెవుల బడింది. కాని నాకు సంబంధించినది కాదని వూరుకున్నాను. నాకు స్వంత ఖర్చులుండేవికావు. అందువల్ల అమ్మచేతుల్లోనే వుండేది డబ్బంతా.

రెండోసారి తీసిన సినిమాకూడా చాలా బాగావుందని, మాపాత ప్రొడ్యూసరే నన్ను నెలకి రెండువందలయాభై మీాద మరో పిక్చరుకి బుక్ చేశారు.

అక్కడితో ఆరంభమయాయి చిక్కులు. అన్నయ్యకీ నాకు మళ్ళేనే ఒకేడుకి మరోవేడు పైనబడుతోంది. పూర్వం ప్రొడ్యూసరూ, డైరెక్టరూ చిన్నవాడని నవ్వివూరుకునేవారు.

ఈమూడో పిక్చర్లో నాదిహీరోయిన్ పోర్షన్. అంచేత కాస్త కష్టపడి పనిచెయ్యాల్సి వచ్చేది. ఒకనాటిరాత్రి

రిహార్సల్సు పన్నెండుదాకా అయాయి. రెండుమూడు డైలాగ్సు బాగా చెప్పలేకపోతుంటే, కూచుని చెప్పిస్తున్నారు, కవిగారు, నాచేత. నాకా డైలాగ్ ఒక పట్టాన రాలేదు. పక్కనేవున్న అన్నయ్య "పోనీ, యింకో మాదిరిగా చెప్పించవయ్యా-దాన్ని అంతబాధపెట్టకపోతే" అన్నాడు.

"నీ కెందుకయ్యా అనవసర ప్రసంగం-నువ్వో మూల కూచోరాదూ..." అన్నాడు కవి అన్నయ్య మీద విసుక్కుంటూ.

"మూలకూచోవాలీ - కూచుంటా ! కాస్తమాటలు సరిగ్గా రానియ్యి. ఎవరనుకుంటున్నావ్?" అన్నాడు అన్నయ్య దురుసుగా.

"ఎవరనుకోవడ మేమిటి? తెలియడంలే-ఆఅమ్మాయి వెంటవచ్చే అన్నగారివి. రేణుకకు స్వయానా సోదరుడివి" అన్నాడు కవి వెక్కిరింపుగా.

"రోజూ యింత ఆలస్యం అవుతే ఎల్లాగండీ...దాని ఆరోగ్యం పాడవుతుంది. పగలు రిహార్సల్సు పెట్టుకోరాదూ?" అన్నాడు అన్నయ్య డైరక్టరుతో కవిమీద కోపం పట్టలేక.

"అల్లాగే లే" అని ఆయన నవ్వి వూరుకున్నారు.

"నీకా, చెల్లెలుకా ఆరోగ్యం పాడయేది !" అన్నారు కవి తిరిగి.

దాంతో మాటమాట పెరిగింది. "ఉద్యోగం వెలిగించుకోక యీ గైడ్ పనేమిటి?" అని తిరిగీ అన్నారు ఆయనే.

"నీ కెందుకు ? చెప్పొచ్చావ్ ? అసలు నువ్వావుంటే, మా చెల్లెలు రిహార్సల్సుకి రాదు." అని లేచాడు అన్నయ్య.

"నేను లేకపోతే, సినిమా లేదు," అన్నాడు కవి.

ఈవాదన వొకపట్టాన తెగలేదు. డైరక్టరు కలిపించు కున్నాడు. వాదనలోనూ అన్నయ్యకీ వాళ్ళకళ్ళముందు ఎంత గౌరవం వుందో నాకు స్పష్టమయింది. "పోనీ వూరుకో అన్నయ్యా" అన్నాను నవ్వుతూ.

"నువ్వు వాడిని వెనకేసు కొస్తున్నావా ? ఇంటికెళ్ళి అమ్మతో చెపుతాను. అసలింక నువ్వావుద్యోగంచెయ్యవద్దు," అన్నాడు అన్నయ్య.

"పాపం, బుచ్చిబాబ్ ! అమ్మతో చెబుతాడట. చెప్పు! నాయనా, చెప్పు. ఆవిడ వుద్యోగం చెయ్యకపోతేమన పోషణమాటో ?" అన్నాడు, కవి వూరుకోకుండా.

అన్నయ్యకి కోపంవచ్చి వెళ్ళిపోయాడు, డైరక్టరుగారు కవిని అలాతొందరపడకూడదని మందలించారు. ఆయన బి.ఎ. దాకా చదివాడు. సమర్థుడు. యింక ఏమనగలరు ! ఆయన మటుకు తొణక్కుండా — బెణక్కుండా — "వున్నమాట అన్నాను. దానికే వులుకా ? అసలు యిక్కడ అతనెందు కంట !" అని వాదనలో దిగారు.

చివరికి తేలిన సారాంశమేమిటంటే; మర్నాటినుంచి అన్నయ్యని వెంటపెట్టుకు రావడం శ్రేయస్కరం కాదని తేల్చారు. నేను ఒంటరిగా గాని, అమ్మని వెంటపెట్టుకుగాని

రావడం మంచిదని నిర్ధారణ చేశారు. మర్నాడు అమ్మతో వచ్చి మాట్లాడుతానని చెప్పారు ప్రొఫెసర్‌గారు.

ం ం ం

రాత్రి రెండుగంటలకి యింటికొచ్చే వేళకి హాల్లో లైట్లు వేసివున్నాయి. అన్నయ్యా—అమ్మా సోఫాలో కూచుని ఏదో గట్టిగా వాదించుకుంటున్నారు. నేను గుమ్మంలోకి అడుగుపెట్టగానే "దిగింది – దొరసాని – పాపం, యీపాటి కన్నా అయాయా కబుర్లు!" అన్నాడు అన్నయ్య.

"వూరుకోరా – వాడిమాటలకేంగాని – అసలు ఏం జరిగిందో చెప్పవే" అంది అమ్మ.

నేను సగం చెప్పేవేళకి అన్నయ్యలేచి కేకలు మొదలెట్టాడు. "వాళ్ళంతా అంటూంటే ... తనూ వాళ్ళతో చేరి అనటం మొదలెట్టింది. అన్నయ్యని అంటున్నారని అభిమానమన్నా లేకపోయింది. ఆ వెధవ కవిగాడు నీకు ఎక్కువయాడేం?" అని తిట్టడం ఆరంభించాడు.

"నేను నిన్నేమన్నా అన్నానా! వాళ్లూ నువ్వూ అనుకుంటుంటే ఏటు చెపుతే, ఏంతప్పో అని వూరుకున్నాను." అన్నాను.

"వూరుకున్నావు. వూరుకుందువుగాని. మహా సంపాయిస్తున్నానుగదా అని మిడిసిపడుతున్నావు. రేపటినుంచి ఆ వెధవవేషాలు కట్టిపెట్టు. నువ్వు గుమ్మందాటేందుకువీల్లేదు."

నాకు కళ్ళమ్మట నీళ్లొచ్చాయి. వాళ్లూవాళ్లూ తిట్టుకుమధ్య నామీద ఎందుకంట ఎగరటం?

"నువ్వు వూరుకోరా...అలాతొందర పడ్తే ఎలా ? అది ఉద్యోగం చెయ్యకపోతే ఎట్లా ? ఎవరో ఒకరు సంపాయించాలా వద్దా ?" అంది అమ్మ.

"నే సంపాయిస్తాను, ఏదో ఒక ఉద్యోగంచేసి. అది మటుకు ఆ వెధవల్తో తిరిగిందా, నేను వూరుకోను ... నా కప్రతిష్ట !"

"నువ్వు వుద్యోగంలో చేరేదాకానో ? అప్పటిదాకా మన గతేంగాను ?"

"నువ్వు వడ్డీలకిచ్చిన డబ్బు వెనక్కి తీసుకో. ఖర్చు చేసుకుందాం..."

"వడ్డీల కేమిటమ్మా ?" అని అడిగాను. అసలు అమ్మ డబ్బుదాస్తోందని ఆ క్షణందాకా నాకు తట్టనే లేదు.

"వాడల్లా పిచ్చిగా మాట్లాడుతూనే వుంటాడు. నువ్వు వూరుకోవే....పదండి పడుకుందాం." అని లేచింది.

"రెండుమూడువేలు మూటగట్టిన నీకు పిచ్చిలేదు.... చెప్పిన నాకు పిచ్చి...." అంటూ అన్నయ్య వీధితలుపు గట్టిగావేసి వెళ్ళిపోయాడు.

నేను అమ్మ మొగంలోకి చూడబోయాను. ఆమె నా చూపుని తప్పించుకొంది.

ఆరాత్రి మొదటిసారి నాకు నాభవిష్యత్ గురించి ఆలోచనలు వచ్చాయి. అమ్మకిగాని; అన్నయ్యకుగానీ నాకు

పెళ్ళి చెయ్యాలనే సంకల్పం వున్నట్టులేదు. యిలా - నాసంపాదన మీద తింటూవుందామనే అభిప్రాయం వాళ్ళ మాటల్లో వ్యక్తమవుతోంది. మూడేళ్ళనుంచి నేను వీళ్ళందరినీ పోషించాను. ఈ మూడేళ్ళలో నాచేత్తో ఒక్క చీరె గూడా కొనుక్కో-లేదు-అమ్మ కొన్న చీరలు తప్పితే. మూడేళ్ళ సంపాదనలో-మెళ్లోకి రెండుపేటల గొలుసూ, నాలుగు జతల గాజులూ, ఒక పాతిక చీరెలూ - యివే నా స్వంత ఆస్థి. మిగతావన్నీ నావికావు. అమ్మ రెండువేలు నిలువజేసుకుంది. తమ్ముడు చదువు కుంటున్నాడు. అన్నయ్య సంపాయించుకోగలడు. ఎటొచ్చీ, తనొక్కతే మిగిలిపోయింది. యీనాడు వాళ్ళ ఉద్యోగం లేదు పొమ్మంటే నిరాధారం - తనను ఎవరు పెళ్ళిచేసుకుంటారు ? ఏమిటో అంతా శూన్యంగా, భయంకరంగా కనిపించింది. తెల్లవారి కాకులు కూసేదాకా కళ్ళుమూతలు పడలేదు నాకు.

ఎనిమిదింటికల్లా డైరక్టరూ ప్రొడ్యూసరూ వచ్చారు.

అన్నయ్య నన్ను పంపనని చెప్పాడు.

సగంలో మానేస్తే కంట్రాక్టులోని షరతుల ప్రకారం నామీద నష్టపరిహారార్థం పదివేలదాకా దావావెయ్యవచ్చుననీ, ఆహక్కు వారికుందనీ-వాళ్ళు అమ్మా అన్నయ్యలతో స్పష్టంగా చెప్పారు.

"ఆ కవిని తీసేస్తే - మా చెల్లెలు వస్తుంది. లేకపోతే రాదు" అన్నాడు అన్నయ్య.

"ఆ కవి పాటలు లేందే మనుషులు సినిమాయే చూడరు. మీ చెల్లెలు పిక్చరుకెంతముఖ్యమో అతనూ అంతే. అందుకని అలాంటివేమీ పనికిరావు. పిన్నిగారూ–సాయంత్రంనుంచి షూటింగ్‌కి అమ్మాయిని మీరు వెంట పెట్టుకురండి–లేకపోతే వంటరిగా పంపండి. మేము చూసుకుంటాం. భయంలేదు" అని అమ్మతో చెప్పి వెళ్ళారు.

ఆనాటినుంచీ నేను–వంటరిగా షూటింగ్‌కి వెళ్ళడం మొదలుపెట్టాను. ఒక్కొక్కప్పుడు అమ్మకూడా వచ్చేది. అన్నయ్య వారంరోజులపాటు యింటికి రాలేదు. ఆ పైన మామూలుగా యింట్లో వుండటం మొదలుపెట్టాడు కాని–నాతో మాట్లాడటం మానేశాడు. పైపెచ్చు నూటీపోటీ మాటలు కవినీ, నన్ను కలిపి అంటూండేవాడు. అమ్మ ఆ మాటలు లక్ష్యపెట్టుకోవద్దంది.

3

అనిల్‌బాబు కవిగా కాస్తో, కూస్తో పేరుబడ్డాడు. అసలు ఆయనపేరు హనుమంతరావు. బెంగాలీ పద్ధతిని పేరు మార్చుకున్నాడు. బి. ఏ. పూర్తిచెయ్యక కథారచనలో దిగారట. ఆయన నేను నటిస్తున్న పిక్చరుకి కథ, పాటలూ, సంభాషణలున్నూ రాస్తున్నారు. శాస్త్ర చదువుకున్నవాడూ, రచయితా కాబట్టేమో డైరక్టరూవాళ్లూ దడుస్తూండేవారు. మనిషిలోకూడా చురుకుదనం, మాటమాటకీ చలోక్తివిసిరేగుణమూ

వుండేవి. మా అన్నయ్యతో ఘర్షణ అయినప్పటినుంచీ ఆయన పట్ల చాలా కోపంగా ప్రవర్తించేదాన్ని. అసలు నాకూ ఆయనకీ ఏమీ పరిచయం లేకపోయినా, అన్నయ్యని అన్ని మాటలన్నారనీ, ఆయనవల్లే వాడు నాతో మాట్లాడటంలేదనీ కించగా వుండేది. సాధ్యమైనంతవరకు ఆయనను తప్పించుకుని తిరిగేదాన్ని. కాని సమర్థుడు కనక ఆయన క్రమంగా నాతో స్నేహం ఏర్పరచుకున్నారు. స్టుడియో, యిల్లూ కాక మద్రాసులో యింకా చూడవలసినవి చాలా వున్నాయని ఆయన నాకు తెలియబర్చారు. అడయారు, మ్యూజియం, జూ, ఇలాటి వాటికి నన్ను తీసుకెళ్తాననేవారు. అమ్మని అడగందే రాననేదాన్ని.

"నెలకి మూడువందలు తెస్తున్నావ్, పదిహేడేళ్ళు నిండాయి. యింకా అమ్మని అడగాలా? నీ వ్యక్తిత్వం నువ్వు కాపాడుకోవాలి. నువ్వు ఇంటిని పోషిస్తున్నావు. వారంతా నీమాట వినాలి. అంతేగాని అమ్మకూ అన్నయ్యకూ దడుస్తావా?" అన్నారు, హేళనచేస్తూ.

ఇంకోరోజున "నువ్వు మానసికంగా పెరగాలి. ప్రౌఢ్యాలని చూసి నువ్వు భయపడకూడదు; వాళ్ళు నిన్ను చూసి భయపడాలి. భయపడుతున్నకొద్దీ లోకం నిన్ను బెదరకొడ్తుంది. మనిషికి తెగింపు రావాలి. ఒకప్పుడు, బి. ఏ. పాసుకాకపోతే నేను ఎందుకూ పనికిరానని, అందరూ అన్నారు. నిర్భయంగా నేనీ సాహిత్యరంగంలోకి దూకడంవల్లనేగదా పేరుప్రఖ్యాతు

లోచ్చాయి. బి. ఏ. పాసయిన వారంతా వాజమ్మల్లా గుమాస్తాపని చేస్తున్నారు. నేనుచూడు ఎలావున్నానో. నువ్వు పెరగాలి. రేణుకా."

ఆయన మాటలు నాకు పూర్తిగా అర్థం అయేవికావు. కాని ఏదో కొత్త ప్రపంచంవైపు పట్టుకుపోతున్నారా అని పించేది. ఒకరోజున నాకీ విప్లవసందేశం బాగా నూరిపోసి మొదటాట సినిమాకి తీసుకెళ్ళారు.

అమ్మతో చెప్పకుండా వెళ్ళడం నాకు మనస్కరించ లేదు. కాని "యిన్నాళ్లు శిష్యరికంచేసి యింతేనా !" అని కవిగారు మర్నాడు గేలిచేస్తారేమోనని భయంవేసి, ఆయ నతోగూడా సినిమాకి వెళ్ళాను. టాక్సీలో తీసుకొచ్చితొమ్మి దిన్నరకి గుమ్మందగ్గిర వదిలారాయన. వీధిగుమ్మంలో నా కోసం ఎదురుచూస్తున్న అమ్మా, అన్నయ్యా అనిల్ బాబును చూశారు. ఇంకా ఏముంది ? పెద్దయుద్ధం! అమ్మ ఏడుపు - అన్నయ్య నేనేదో చెడిపోయినట్టూ, పనికిరానిదాన్నయి నట్టూ, నానామాటలూ అన్నాడు.

"వాడితో ఎక్కడికెళ్లావ్ ?" అన్నాడు అన్నయ్య.

నేను మాట్లాడలేదు.

"షికార్లు కొడుతున్నావా ఆ వెధవతో ? నే చెప్ప లేదమ్మా-దీనికి పొగరెక్కిందని" అన్నాడు అన్నయ్య.

"ఎక్కడికెళ్ళావే ?" అంది అమ్మ.

"సినిమాకి" అన్నాను.

"ఎవరితో - అతనితోనే ?" అంది అమ్మ.

"ఏం ? అతనితోనే - ఏం చెడితే ?" అన్నాను అనిల్ బాబు నేర్పిన విప్లవపాఠాలు జ్ఞప్తికి తెచ్చుకుంటూ.

"చూశావా అమ్మా-యిక సంతోషించు. రెండు చేతులూ నెత్తికి తెచ్చుకున్నావ్. చూశావా, ఎలా ఎదిరిస్తోందో ?" అన్నాడు అన్నయ్య

"నేను ఎదిరించలేదు. అడిగినదానికి సమాధానం చెప్పాను" అన్నాను.

"ఎవర్నడిగి వెళ్ళావ్ ?" అన్నాడు అన్నయ్య.

"నాకు వెళ్లాలనిపించింది-వెళ్లాను" అంటూ సమాధానానికి ఎదురుచూడకుండా లోపలికి వెళ్ళిపోయాను. గదిలోకి వెళ్ళి మొట్టమొదటిసారిగా నాముఖాన్ని అద్దంలో పరీక్షగా చూసుకున్నాను. "నువ్వు అందగత్తెవని నీకు తెలీదు. ఆ తెలియక పోవడంవల్లనే నీలోగొప్ప ఆకర్షణ కనిపిస్తోంది. నిన్ను చూడగానే మల్లెలు జ్ఞప్తికొస్తాయి. మల్లెపువ్వులాంటి అందం నీది" అని అనిల్ బాబు సినిమాలో చెప్పినమాటలు జ్ఞాపకం వచ్చాయి. ఇంతబాధలో ఏదో సరదా కనిపించింది. ఆ రాత్రి అమ్మ నన్ను అన్నానికిపిలువలేదు; నేనూ వెళ్ళి భోంచేయలేదు.

తెల్లవారి తమ్ముడు రోజూమాదిరి నన్ను లేపలేదు. అమ్మ కాఫీ తెచ్చి యివ్వలేదు; నేను అడగాలేదు. ఎనిమిదిం

టికి స్టుడియోకారు వచ్చింది 'అమ్మయ్యా' అని యింట్లోంచి బయటపడ్డాను. స్టుడియోకి వెళ్ళగానే అనిల్‌బాబు కనిపించారు. అతన్ని చూడగానే ప్రాణంలేచివచ్చి నట్టయింది. ఇడ్లీతిని కాఫీ పుచ్చుకున్నాక యింట్లో జరిగిన గోలంతా ఆయనకి చెప్పాను.

ఆయన నవ్వి,"ఇంకా మొదటి స్థాయిలోనే వున్నావు. నీ డబ్బుతిని నీమీదే స్వారీ చేస్తున్నారు. పెద్దవాళ్ళు ఎప్పుడూ అంతే. నువ్వు వాళ్ళమాటలు లెక్క చెయ్యకు. నేనున్నానుగా -నీకెందుకు !"

ఆమాటలు వినేసరికి నాకు కొండంతధైర్యం వచ్చింది.

ఒకనాడు బీచిలో యిద్దరం కూచున్నాం "ఆఫీసులో మనిద్దర్నీ గురించి రకరకాలుగా అనుకుంటున్నారు." అన్నారు అనిల్ బాబు.

"అనుకుంటే వాళ్ళ పాపాన వాళ్ళు పోతారు. వాళ్ళు అనుకుంటారని మీస్నేహం మానుతానా ?"

"చాలా పెద్ద దానివి అయిపోయావే! కాని నాకళ్ళకి నువ్వెప్పుడూ చిన్నదానివిలాగానే కనపడతావు. ఈ పిక్చరు అయిన తరువాత ఏంజేస్తావ్?"

"ఇంకో సినిమాలో యాక్ట్ చేస్తానేమో!"

"అంటే నీ జీవితమంతా యిలా సినిమాల్లో యాక్ట్ చెయ్యడంతోనే గడుపుతావన్నమాట. నీకు పెళ్ళి చేసుకోవాలని లేదా?"

అనిల్ బాబు అలాటిమాటలు మాట్లాడటం నా కిష్టం లేదు. కాని ఆయన నోరుకట్టెయ్యడం ఎలా ?

"నువ్వింకా చిన్నపిల్లవి. మీ వాళ్ళకి నీ సంపాదన తినటం తప్పితే మరో ఆలోచనలేదు. నీలో పెద్ద తార అయే లక్షణాలు చాలావున్నాయి. ఎప్పుడూ నెలకి రెండుమూడు వందలే తెచ్చుకుంటూవుంటానని అనుకోకు" అన్నారు మళ్ళీ.

నా కసలు ఏదీ అర్థం కావడంలేదు.

కనుచీకటి పడింది. ఇంటికి బయలుదేరాము. టాక్సీలో కూచున్నాము. నువ్వుచాలా అందంగా వుంటావని నీ కెవరూ చెప్పలేదా?" అన్నారుమళ్లీ. నేను మాట్లాడలేదు. దారిలో నన్ను దగ్గిరగా లాక్కొని, నా నడుంచుట్టూ చెయ్యివేశారు. నా కెందుకో అసహ్యం వేసింది. కాని అనిల్ బాబుని ఏమీ అనలేకపోయాను.

"మనిద్దరం పెళ్ళి చేసుకుంటే ఆదర్శదాంపత్యం అవుతుంది కదూ ! నువ్వు నటివి-నేను కవిని. ఎంత బాగుంటుంది. ఏమంటావ్ ?" అన్నారు, నా చేతిని నొక్కుతూ.

నాకెందుకో చాలా భయంవేసింది. ఆయన మాటలూ చేష్టలూ హితవుగా లేవు. అంతవరకు ప్రేమంటే ఏమిటో నాకు తెలియదు. దాన్ని గురించి నేను ఆలోచించలేదు... నేను సమాధానం యివ్వకపోవడంచూసి, "వెంటనే చెప్పక్కర్లేదు. తొందరేముంది?" అంటూ నా ముఖాన్ని ముద్దులతో నింపారు.

పాపభీతి కాస్త భయపెట్టింది; పురుషుడు ఆ విధంగా నన్ను తాకడం, మాట్లాడటం మొదటిసారి అవడంవల్ల ఏదో కొత్తగాను, మధురంగానూ తోచింది. అందులో 'నన్ను ప్రేమిస్తున్నాడు' అని అనుకునే వేళకి సంతోషం పొంగు కొచ్చింది. కందిన నా చెంపల్ని ఆ రాత్రి అనేకసార్లుఅద్దంలో చూసుకున్నాను.

అనిల్‌బాబుకి తల్లీ తండ్రీ లేరు. వెధవ అప్పగారూ, మేనకోడలూ వున్నారు. ఆ అమ్మాయికి పదమూడేళ్ళు. ఆ పిల్లంటే అనిల్‌బాబుకి పంచ ప్రాణాలు. ఆయనకి ఆఫీసులో గౌరవం అయితే ఎక్కువవుంది గాని డబ్బు చాలా స్వల్పంగా ముట్టుతూండేది.

కాఫీహోటళ్ళకీ, సినిమాలకీ, ఆయనే ఎప్పుడూ ఖర్చు పెట్టేవారు. అసలునాకు బయటకు పర్సు పుచ్చుకెళ్లాలని తెలి సేదేకాదు. ఒకసారి ఆఫీసుకు వెళ్ళేవేళకి అనిల్‌బాబుప్రొడ్యూ సర్ని డబ్బు అడుగుతున్నారు. ప్రొడ్యూసరు లేదని నిర్మొహ మోటంగా చెపుతున్నాడు.

నేను విననట్టు వూరుకున్నాను. ఆ మధ్యాహ్నం ఆయన పెందరాళే యింటికి వెళ్తూ చెప్పారు. మేనకోడలికి చాలా జబ్బుగా ఉందనీ, యింజక్షనులకీ వాటికీ డబ్బడిగితే ప్రొడ్యూసరు యివ్వలేదనీను. తను త్వరగా వెళ్ళాలని చెప్పి వెళ్ళిపోయారు.

నాకు ఆయన కష్టంలో ఆదుకోవాలని అనిపించింది. అప్పటికి కాని, డబ్బు చేతులో ఉండటంలోని ఆవశ్యకతని

గుర్తించ లేకపోయాను. అంతకు మూడురోజుల క్రితమే అమ్మకి నా జీతం రెండువందలయాభై యిచ్చాను. అందులో ఒక్క యాభై అయినా అడిగి తీసుకు, అనిల్ బాబుకి యిద్దామనుకున్నాను ఇంటికెళ్ళి అమ్మని అడిగాను, ఒక యాభై కావాలని.

"ఎందుకూ?" అంది అమ్మ.

"నాకు కావాలి?" అన్నాను.

"చెప్పగూడని ఖర్చులొచ్చాయా? లేవు. అయిపోయాయి" అంది నిక్కచ్చిగా.

"అయిపోయాయా? మొన్ననేగా జీతం యిచ్చింది. యీ ఒక్కసారికీ యివ్వవూ - పాపం, అనిల్ బాబు మేనకోడలికి చాలా జబ్బుగా ఉందిట."

"వూళ్లో వాళ్లందరికీ యిచ్చేందుకా? చిన్నపిల్లను చేసి నీ దగ్గిర డబ్బుకూడా గుంజాలని చూస్తున్నాడా? చూడు, ఆఫీసుకొచ్చి యీ సంగతి తేల్చుకుంటాను. డబ్బూలేదు - గిబ్బూలేదు. లోపలికి పో" అంది, గదమాయిస్తూ అమ్మ.

మొట్టమొదటి సారిగా నే నెంత నిస్సహాయురాలినో అర్థమయింది. మూడున్న రేళ్లనుంచి ఏ వొక్కనాడూ కానీ కావాలని అడగలేదు. ఈనాడు మొదటిసారి అడుగుతే యిలా చేస్తున్నారు. ఈ మనుషులమీద పట్టరానికోపం, అనిల్ బాబు మీద అమితమైన జాలీ పుట్టుకొచ్చాయి.

మర్నాడు ఆఫీసుకు వెళ్ళీవెళ్లగానే ప్రొడ్యూసరునివంద రూపాయలడిగాను. తక్షణం ఆ పైకం అనిల్‌బాబు గారింటికి తీసుకెళ్ళి యిచ్చాను. అతని అక్కగారు కంట నీరు పెట్టుకుంది, తమపాలిటి దేవతనని చేతులు రెండూ పట్టుకుంది. అనిల్ బాబు నావంక సాలోచనగా చూశారు. ఆ యిల్లు నాకు స్వర్గం మాదిరిగా తోచింది.

ఆ సాయంత్రం ఆఫీసులో అమ్మ ప్రొడ్యూసరుగారి ముందు, వందరూపాయల విషయమై చాలా గొడవచేసింది. ఇక మీదట నా చేతికి కానీగూడా ఇవ్వరాదని కట్టుదిట్టం చేసింది. అనిల్‌బాబు నన్ను చెడగొట్టేస్తున్నాడని స్పష్టంగా అంది అక్కడి వాళ్ళతో.

అనిల్‌బాబుని కలుసుకోకుండా నన్ను వుంచడానికి అన్నయ్య, అమ్మా చాలా ప్రయత్నించారు. లాభంలేక పోయింది. ఒకసారి అన్నయ్య స్నేహితుల్తో ఆయన్ని కొట్టించ బోయాడు. అనిల్‌బాబు పోలీస్ రిపోర్టుయిచ్చారు.

రానురాను యిల్లు నరకంకంటే అన్యాయంగా తయారయింది. అన్నిటికన్నా నన్నోప్‌ అంటరాని దానికింద చూసే వారు అంతా. నాభోజన సదుపాయాల గురించి అమ్మ కను క్కోవడం పూర్తిగా మానేసింది. ఇంట్లో అంతా ఒకపక్షంగా చేరి, నామీద కత్తి నూరుతుండేవారు.

బాంక్ అక్కవుంటు వోపెన్ చేసి, ఒక నూరు రూపాయలు బాంక్‌లో వేసుకుంటానని ప్రొడ్యూసరుతో చెప్పి, నా

జీతంలోని ఒక వంద రూపాయలు తీసుకున్నాను. ఆ నాటితో తుఫాను చివరి స్టేజీలోకి వచ్చేసింది.

అన్నయ్య నన్ను కొట్టేందుకు మీదకొచ్చాడు. అమ్మ తల బద్దలుకొట్టుకుంది. తమ్ముడు అర్థంకాక చూశాడు.

ఈ రాద్ధాంతం అంతా ఒక వంద రూపాయలు నా సొమ్ము నేను తీసుకున్నందుకన్నమాట. ఇంట్లో అందరికీ నా మీదకాదు ప్రేమ-నా డబ్బుమీద. అన్నయ్య ఎత్తినచెయ్యి నా వంటిమీద పడకుండా బయటపడి, సరాసరి అనిల్ బాబు గారింటికి వెళ్ళాను.

నెల్లాళ్ళ క్రితం దేవతననీ, తనకూతురి ప్రాణదాతననీ చేతులుపట్టుకున్న అనిల్ బాబు అప్పగారు, నేను దిక్కు లేకుండా వారింటికి వెళ్ళే వేళకి మొఖం తిప్పేసుకుంది. వాళ్ళ తమ్ముడిని పట్టుకుని వేలాడుతున్న పిశాచినట! అతని డబ్బుకోసం నేను వేస్తున్న ఎత్తట. నోటికిరాని మాటలన్నీ అందావిడ. సినిమా దాన్ని కనక ప్రతి సాయంత్రం యిలా ఎవరింటిమీదనో విరుచుకుపడుతూనే వుంటానట. నేను యింట్లో అడుగు పెట్టేందుకు వీల్లేదని ముఖంమీద చెప్పేసింది. అనిల్ బాబు ఆ రాత్రి నన్ను తన స్నేహితుడింట్లో ఉంచారు.

మా పెండ్లికి ఆయన అప్పగారు ఏ మాత్రం అంగీకరించలేదట. అంతగా అయితే వుంచుకోమందిట. సినిమా దాన్ని పెండ్లాడితే వాళ్ళ మర్యాద మంట కలుస్తుందట. కాని

ఆ సినిమావాళ్ళ చుట్టూ తిరిగి తమ్ముడు సంపాయిస్తూంటే మర్యాదకి భంగంలేదు కామోసు.

ఆ మూడోనాడు ప్రొడ్యూసరూ, డైరెక్టరూ మరిద్దరి స్నేహితుల సముఖంలో మా పెండ్లి గుప్పిచప్పుడు లేకుండా జరిగింది.

ఆ

మా పెండ్లితో అటు నావైపువారికీ యిటు అనిల్‌బాబు వైపువారికీ యిద్దరికీ మేము విరోధులమయాం. కొత్త యిల్లూ, సంసారం అన్నీ ఏర్పాటు చేసుకున్నాం. ఆరునెలలపాటు ఎంతో సుఖంగా వున్నాం. ఆ ఆరునెలల్లో పిక్చరు పూర్తిఅయింది. అప్పటినుంచీ ఆరంభమయాయి బాధలు.

పిక్చరు ఫేలయింది కాని, నా యాక్టింగుని మెచ్చుకొన్నారందరూ. కథ, డైలాగ్సు, పాటలూ ప్రజలకి రుచించలేదు. దానితో అనిల్‌బాబుకి చిన్నతనం కలిగింది. మనసులో ఏముందోగాని నన్ను సినిమాల్లో యాక్టు చెయ్యవద్దని నిషేధం పెట్టాడు! నేను దానికి అట్టే విచారించలేదు. ఏ స్త్రీ కమ్మటి కాపరం కంటె సినిమా నటన కావాలని అంటుంది కనక! ఎటొచ్చీ, డబ్బు వచ్చేదారి కనపడేదికాదు. కవిగా ఆయన పేరు చెడటంవల్ల ఏ ప్రొడ్యూసరూ ధైర్యంచేసి ఆయన్ని బుక్ చెయ్యలేదు. పిక్చరు పూర్తి అవడంతో నాకు నెలనెలావచ్చే జీతం ఆగిపోయింది. నాకు బుకింగ్‌వస్తే వద్దని నిరాకరించారాయన.

నాలుగు నెలలపాటు ఉద్యోగంకోసం నానా శ్రమా పడ్డారు. ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. ఇద్దరికీ సంపాదన లేదు. డబ్బు లేకపోతే మానవుల్లోని మృగాలు బయటపడతాయి. చిన్న చిన్న కీచులాటల్లో "నన్ను పెండ్లి చేసుకోవడం వల్ల తను యిబ్బంది పడుతున్నట్టు అభిప్రాయం వెలిబుచ్చుతూ వచ్చారు. నాకుమటుకు చాలా కష్టంగా ఉండేది.

"డబ్బు ఉన్నప్పుడు సుఖపడ్డాం; లేనప్పుడు కష్టపడుతున్నాం. అంతేగాని దానికి నేను కారణం అని వేలెత్తి చూపుతూంటే మనసు కోతపెట్టినట్టు ఉండేది.

మరో రెండు నెలలు నా వంటిమీాద నగలు అమ్ముకు తిన్నాం. ఆయనకి ఉద్యోగం దొరకే సూచనలు కనబడలేదు. ఎటొచ్చీ, నేను సంపాయించాలి. చివరికి రెండు కంపెనీల్లో యాక్ట్ చేసేందుకు, ఒకదానిలో నెలకి నాలుగువందలూ, మరో దానిలో మూడువందలకు వప్పుకున్నాము.

'పూర్వం అన్నగారు వచ్చేవాడు సాయం, ఇప్పుడు భర్త వస్తున్నాడు' అనుకునేవారు స్టుడియోలలో. ఏమనుకుంటే నేం!

నెలకి ఏడువందలూ చేతుల్లోపడేవి. ఆయనే ఖర్చు పెడుతూండేవారు. మొదటినుంచీ డబ్బు ఎలా ఖర్చుపెట్టాలో నాకు తెలీదు.

అప్పటికి నాకు నాలుగో నెల అనుకుంటాను. కంపెనీల్లో బుక్ అయి అయిదు నెలలయింది. రాబోయే ఖర్చుకోసమై

కాస్త నిలవచేయడం మంచిదని చాలాసార్లు ఆయనకి చెప్తూ వచ్చాను. "అల్లాగే, నీకు కంగారెందుకు నాకుమటుకు తెలీదా?" అంటూ సర్ది చెపుతూండేవారు.

ఆనాడు సెట్ మీద-నిచ్చెనపైకి ఎక్కాల్సిన సన్నివేశం ఒకటి నటించాల్సి వచ్చింది. కాలుజారి కిందపడ్డాను. అంతే-విపరీతమయిన బాధ నొప్పులూ ఆరంభమయాయి. మూడోరోజు తెలివివచ్చి చూసేవేళకిహాస్పిటల్‌లోవున్నాను. 'మిస్ కారేజి' అయిందట. క్లోరోఫారమ్ యివ్వాల్సి వచ్చిందట. నెల్లాళ్ళదాకా లేచి తిరిగేందుకు వీలులేదని చెప్పాడు డాక్టరు. నా కాళ్ళు రెండూపడిపోయాయని, యింక యాక్టింగుకి పనికిరాననీ గిట్టనివాళ్ళు నామీద వదంతి వేశారు. కంపెనీ వాళ్ళు యివ్వవలసిన రాళ్ళు బిగపట్టారు. మళ్లీ మేము బయలుదేరిన చోటికే వచ్చాము.

నేను ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోకుండా, వచ్చింది వచ్చినట్టు ఖర్చుచేసేవారు. నేను ఖర్చు చేసినందుకు ఏమీ అనుకోలేదు. కాని, అవసరానికి ఎక్కడనుంచీ తీసుకురాలేక పోయారే అని విచారించాను.

ఈమధ్యలో చేయించుకున్న గొలుసూ, గాజులూ హారించుకుపోయాయి. ఎక్కడా అప్పుపుట్టలేదు. ఆఖరికి పళ్లూ పాలకికూడా కిటకిటలాడాల్సివచ్చింది. అటు మావాళ్లూయిటు వాళ్ళవాళ్ళూ, అంతా మొహం చాటేశారు. డాక్టరు ఫీజు,

యింజెక్షనులు, మందులు ఎటుచూసినా డబ్బుకావాలి. డబ్బు జీవితానికి ఎంతటిఅవసరమైన వస్తువో మొట్టమొదటిసారినాకు తెలిసింది మంచమెక్కిన తరువాత.

ప్రొడ్యూసర్ ని ఆస్పత్రికి రప్పించి, కాళ్ళకిఏమీ ప్రమాదంలేదనీ, లేచి మళ్లీతిరగ గలదనీ, డాక్టరుచేత చెప్పించిన మీదట కంపెనీవాళ్లు అయిదువందలు యిచ్చారు. దాంతో బయటపడ్డాను. ఆ గండంనుంచి ఎవరూ నా కష్టంలో ఆదుకో లేకపోయారు.. 'ఎవరికి వారే' అన్న పరమసత్యం నాకు నాడు గోచరించింది.

నెల్లాళ్ళ విశ్రాంతి అనంతరం సెట్ మీదకు వెళ్ళడం మొదలుపెట్టాను. డబ్బుకు నానాగడ్డీ తినడంవల్ల ఆయనకి నచ్చజెప్పి, జాయింట్ గా ఎకౌంట్ వోపెన్ చేశాను. అది వోపెన్ చేసేరోజు మేము కాస్త ఘర్షణ పడకపోలేదు. నా కాయనమీద నమ్మకం లేక కాదు; ఖర్చు కాస్త జాగ్రత్తగా చేస్తారని.

డబ్బు కావాలంటే, ప్రతిసారీ నీ సంతకం కావాలి, నువ్వు సెట్ మీద వుంటావు, యింట్లో లేక పోతావ్! అన్నారు.

"సెట్ మీద రాత్రిళ్ళు వుంటాను. అయినా అంత అవసరమైన ఖర్చులు మనకి తెలియకుండా వస్తాయా?" అన్నాను నేను.

వారంరోజులదాకా ఆయననన్ను దెప్పుతూ నేవున్నారు. ఎప్పుడు డబ్బు కావాలంటే అప్పుడు నేనుకూడా సంతకం పెడ్తూండేదాన్ని. ఆయన డబ్బు తెస్తూండేవారు.

ఒక ఏడాది హాయిగా గడిచింది. ఈలోపల నా పిక్చర్లలో ఒకదానికి చాలాడబ్బు రావడంతో, మరో రెండు పిక్చరులలో బుక్ అయ్యాను.

ఒకనాడు సెకండుహాండ్ కారు నాలుగువేలకి అమ్మకానికి వచ్చింది. నాలుగు మూడు సినిమాలలో పనిచేస్తూ నెలకి పదిహేను వందలు సంపాయిస్తున్నప్పుడు కారు కొనుక్కోవాలని అనుకోవడం సహజంకదా! నా నోటిలెఖ్ఖల ప్రకారం బాంకిలో సుమారు అయిదువేలు ఉండాలి. తీరాచూస్తే మూడువందల చిల్లర ఉన్నది బాంకిలో.

ఇంత ఎలా ఖర్చయిందని ఆయన్ని అడిగాను.

"ఇంట్లోకి అయింది. చీరెలకీ సినిమాలకీ, తిరుగుళ్ళకి" అంటూ చదివారు.

కాని నాకు నమ్మకం కలగలేదు. మర్నాడు నాపేర అకౌంటు వోపెన్ చేసేందుకు బాంకుకు వెళ్ళాను. రాతకోతలైన తర్వాత ఏజెంటు అడిగాడు "అయితే జాయింట్ అక్కౌంట్ క్లోజ్ చేశారన్నమాట. యిద్దరికీ చెరో అకౌంటూ వుందిగా!" అని.

అసలు రహస్యం అప్పుడు తెలిసింది. ఆయనకి మరో అకౌంటు ఉందన్నమాట. ఆనాడు అమ్మ వడ్డీలకిచ్చుకుంది. ఈనాడు యీాయన బాంక్‌లో నన్నుమభ్యపెట్టి వేసుకున్నారు. ఇదంతాకష్టార్జితం. ఆనాడు అమ్మాఅన్నయ్యా ఖర్చుచేశారు. యీానాడు యీాయన చేస్తున్నారు. వాళ్లూ దొంగచాటుగా దాచారు, ఈయనా దాచారు. ఈయన ఎక్కువేమిటి? వాళ్ళ తక్కువేమిటి? నాలుగురోజులు ముఖం తప్పించారాయన.

ఆ వేళ షూటింగ్ ఆఖరిక్షణాన కాన్సిల్ అయింది. ఇంట్లో కూచుంటే ఏం తోచలేదు. నా పిక్చరులో హీరో వేషం వేస్తున్న ఆయనా, డైరెక్టరూ వచ్చారు యింటికి.

కాసేపు కూచున్నాక, మంచి యింగ్లీషు పిక్చరు వచ్చింది రమ్మనమని పిల్చారు. వెళ్లకపోతే బాగాఉండదు. తప్పించుకునేందుకు కారణంకూడా ఆక్షణ కనిపించలేదు. సరే నని బయలుదేరాను. బాల్కనీలో మాముందు; అనిల్‌బాబూ ఆయనపక్క నొకపిల్లా. కనుపించారు. క్షణం నిదానించి చూశాక, గుర్తుపట్టాను. ఆ అమ్మాయి ఆయనగారి మేన కోడలు శ్యామల.

పరాయి వాళ్ళముందు బైటపడకూడదుగదా అని శ్యామలని వాళ్లకి పరిచయం చేశాను. ఆయన ముఖం కోపంతో ఎర్రబడ్డదానిని చిరునవ్వుకింద కప్పి మాట్లాడారు. శ్యామలచనువుగా మాట్లాడింది. ఫిఫ్త్‌ఫారం చదువుతూందిట.

మనిషి బాగా పొడుగయింది. వయసులోఉన్నది కనక చూడ టానికి బావుంది. ఈ పిల్ల మందుకోసమేనా - నా వాళ్లతో దెబ్బలాడి వందరూపాయలూ తెచ్చియిచ్చింది అనుకున్నాను.

"అమ్మ నిన్ను చూడాలని అనుకుంటోందిఅత్తా" అంది శ్యామల యింటర్వెల్లో.

"అల్లాగే" అన్నాను కోపం అనుచుకుంటూ.

"నేను మంచంపట్టి చేత కానీలేక అవస్థపడుతున్న ప్పుడు నన్ను చూద్దామని వీరికి తట్టలేదు. ఈనాడు నేను కాస్త పచ్చపచ్చగా వున్నాను కనక కావలసి వచ్చాను. మా వారు ఎంత దుర్మార్గులో-వారానికి ఒకసారి నాకు లెక్చరిచ్చే మాఆయన నాకు తెలీకుండా తన అక్కా- మేన గోడళ్ళతో రాజీ చేసుకున్నారు. నేనుమటుకుఈయనని నమ్మి మావాళ్ళతో మాటకూటా మాటలాడలేదు, రెండేళ్ళబట్టీనీ. దుర్మార్గం విషయంలో అమ్మా-ఒదినగారూ త్రాసులో సరి సమానంగా తూగుతారు.

శ్యామలని యింటివద్ద దించినపుడు, లోపలికి రమ్మన మని మా వదినగారు పిలిచారు. తలనొప్పిగా వుందని నేను దిగలేదు. ఆయనమటుకు అయిదు నిముషాలు ఏవో మాట్లా డేందుకు లోపలికెళ్ళారు.

బయట టాక్సీలో కూచున్నాను. పాతకాలపు జ్ఞాప కాలతో వళ్ళు మండిపోయింది. రెండేళ్ళక్రితం యిలా రాత్రి

వేళ పరిగెట్టుకొచ్చాను. ఆనాడు యింట్లో అడుగెట్టనీయక, నానామాటలూ అన్నమనిషే, యీనాడు నన్ను లోపలికి రమ్మనమని ఆహ్వానిస్తోంది. ఇప్పటికంటే అప్పుడే నేను బేలని. కష్టసుఖాలు తెలియని కన్యని. ఒకపురుషుణ్ణినమ్మి, సర్వస్వం వదులుకు పరుగెత్తుకొచ్చిన అమాయకురాల్ని. ఆనాడు మమ్మల్నిద్దర్నీ బయటికి గెంటింది. ఈనాడు ఆయనకు అక్కగారే ఎక్కువ అయింది నాకంటే! ధనంమీద మనుషుల కెంత అనురాగం! మిగతా నీతికబుర్లు శుష్కప్రలాపాలు. ఇది ఘోరమైన సత్యం. అందరికీ డబ్బు-అమ్మకీ, అన్నయ్యకీ, భర్తకీ, చుట్టాలకీ అందరికీ కావలసింది డబ్బు.

ఆయన లోపలినించి వచ్చి కార్లో కూచున్నారు.

"ఈ వెంటాడే బిజినెస్ ఎక్కడ నేర్చుకున్నావ్?" అని పశ్నించారు ప్రక్కమీద వరగబోతుంటే ఆరాత్రి.

అసలే మనసు చిరాగ్గావుంది. "నాకేం అవసరం!" అన్నాను.

"మరయితే ఏందుకొచ్చావు సినిమాకి?"

"ఏం-మీరు వెళ్ళవచ్చా! షూటింగు కాస్సలయింది. డైరెక్టరుగారు వచ్చి రమ్మనమంటే వచ్చాను. మీరువస్తారని నేను కలగన్నానా!"

"నువ్వుడైరెక్టరుతో వెళ్ళడం, నేను శ్యామలతో వెళ్ళడం ఒకటేనా!"

"వాకెలెందు కవుతుంది? ఎప్పటికీ కాదు" అన్నాను వెటకారంగా.

"అదే నేను చెపుతుంటా! మనకి మర్యాదవుండొద్దూ?"

"తమ్ముడు పెళ్ళిచేసుకోబోయే పిల్లనీ, తమ్ముణ్నీ యిద్దర్నీ వీధిలోకి వెళ్ళగొట్టిన అప్పగారితో పూసుకు తిరగటం మర్యాదస్థుల లక్షణం. చేతిలో కానీలేక, నానా తిప్పలూ పడుతుంటే, డబ్బు సాయంచేసిన ఒక పెద్దమనిషి సినిమా కొస్తారా – అని పిలిస్తే వెళ్ళడం మర్యాదకాదు. అయినా మీ అక్క చెప్పిందిగా నాకు మర్యాదలేదని. ఇప్పుడు విచారించి ఏంలాభం?" అన్నాను కసిగా.

"డబ్బుకోసం గడ్డితింటావా?"

"పాపం–డబ్బుకోసం గడ్డితినని వాళ్ళలో మీరు రెండో వారు. ఒకడు మా అన్నయ్య, రెండోవారు మీరూను. అయినా ఆ వెధవ డబ్బుకోసం కట్టుకున్నదానికి తెలియకుండా మరొక అకౌంటుకూడా ఎందుకు?"

యింక ఆరాత్రి యిల్లు నివాసయోగ్యం కాలేదు. ఆ యింట్లో పిశాచాలు నృత్యంచేశాయి.

"ఇది నాయిల్లు, నాడబ్బు, నాభార్యవి. నాయిష్టం వచ్చినట్టు నడవాల్సిన దానివి. నువ్వెవరు నన్ను అడ్డు పెట్టేందుకు? రేపే మా అక్కనీ, దాని కూతుర్నీ తెచ్చి యీ యింట్లో పెట్టుకోపోతే నాపేరు మారుపేరుపెట్టు. వాళ్ళని

తెచ్చిగాని నీ పొగరు అణచను. రేపటినుంచీ షూటింగ్‌కి వొంటిగా వెళ్ళేందుకు వీల్లేదు" అన్నారు దూకుడుగా.

"మీరొస్తారా? రండి. మీరెత్తుకు పోకుండా మా అన్నయ్య కాశాడు కొన్నాళ్ళు; మరొకడు ఎత్తుకుపోకుండా మీరు కాయండి" అన్నాను నాగది తలుపు లోపల ఘడియ వేసుకుంటూ.

౩౪

ఆ మర్నాడు నేను గదిలో కూచుని టేబుల్‌క్లాత్ కుట్టుకుంటున్నాను. ముందుహాల్లో మనుషుల కంఠాలు, కబుర్లూ, వినిపిస్తున్నాయి. మావదినా, శ్యామలా, మావారూ ముగ్గురూ నవ్వుకుంటూ మాట్లాడుకుంటున్నారు. కొంచెంసేపు అయాక వదిన నేను కూచున్న చోటికి వచ్చింది.

"ఇంటి అద్దెంత? నెలకెంత ఖర్చు? ఏం నగలు చేయించుకున్నావ్?" ఇలాటి ప్రశ్నలన్నీ అడిగింది. అన్నీ ఆయనకే తెలుసు అడగమని సమాధానం చెప్పాను.

"మీ అమ్మగారూ - అన్నయ్యవాళ్ళు కులాసాగా వున్నారా?" అంది ఆవిడ.

"ఆ, కులాసాగానే వున్నారు. రెండు మూడురోజుల్లో వస్తారు యిక్కడికి" అన్నాను ఏడిపించడానికి. నేను మా వాళ్ళని అసలు కలుసుకోనేలేదు.

ఇల్లూ వాకిలీ అన్నీ చూసుకుని వెళ్ళింది ఆవిడ.

వాళ్ళు వెళ్ళాక "మీవాళ్ళని కలుసుకుంటున్నావన్న మాట" అన్నారు.

"ఆ."

"అయితే మరి నన్ను ఆజ్ఞ పెడతావేం? అసలు వాళ్ళతో నువ్వు ఏ మొహం పెట్టుకొని మాట్లాడుతున్నావ్?"

"మీరు ఏ మొహం పెట్టుకొని మీ అక్కతో మాట్లాడతారో, ఆవిడ ఏ మొహం పెట్టుకుని జమాఖర్చులు అడిగిందో, అలాటి ముఖంతోనే నేనూ మావాళ్ళతో మాట్లాడుతాను" అన్నాను.

"నీకింత సిగ్గులేదేం?" అన్నారు ముఖం కందగడ్డలా చేసుకుని.

పదిహేనురోజులు గడిచాయి. ఒకనాడు వీధిలో మా అన్నయ్య కనిపించాడు. కారు ఆపి, ఎక్కించుకున్నాను.

ఏమీ వుద్యోగం చెయ్యడంలేదట. తమ్ముడు స్కూలు ఫైనలుదాకా వచ్చాడుట. అమ్మా వాడూ నన్ను చూద్దామని అనుకొంటున్నారట. కాని బావకి భయపడి రాలేదుట. ఇరవై రూపాయలు చేతులో పెట్టి పంపేశాను అన్నయ్యని— అలా చెయ్యడంలో కొంత కసితీరింది.

మరో పదిరోజులు పోయాక నేను యింట్లోకి రాబోతూంటే వాడు మెట్లు దిగుతున్నాడు.

"ఏరా యిలా వచ్చావు" అన్నాను, అన్నయ్యతో.

"బావ దార్లో కనపడి తీసుకొచ్చాడు. అమ్మని చూసి పల్కరించి వచ్చాడు బావ. నువ్వు రాత్రిదాకా రావనుకుని వెళ్ళిపోతున్నాను" అన్నాడు వాడు. పదిరోజులక్రితం వున్న నమ్రత లేదు యీసారి. కాస్త ధైర్యం చిక్కినట్టుగా వుంది వాడికి. రెండుముక్కలు మాట్లాడి వాడు వెళ్ళిపోయాడు.

ఇంట్లోకి వచ్చాక "యిందాకా మీ అన్నయ్య కన బడ్డాడు. మీ అమ్మను చూసొచ్చాను. పాపం, చాలాచిక్కి పోయింది. పెద్దకూతురు అల్లాగా-చిన్నకూతురు యిల్లాగా— యిద్దరూ కంటికి కాకుండా అయ్యారని కళ్ళనీళ్ళు పెట్టుకుంది. చాలా యిబ్బందుల్లో వున్నట్టున్నారు. ఒక పాతికరూపాయలు యిచ్చి వచ్చాను. నిన్ను పంపుతానని చెప్పా—వెళ్ళిరా పాపం!" అన్నారు.

"నావాళ్ళ సంగతి నాకు తెలుసు మీకు అనవసరం" అని లోపలికి వెళ్ళిపోయాను.

మర్నాడు అమ్మా తమ్ముడూ వచ్చారు. తమ్ముడు కొత్తకొత్తగా చూస్తూ కూచున్నాడు. అమ్మ గట్టిగా కావి లించుకోపోయింది. తప్పుకుని పక్కగా కూచోపెట్టుకున్నాను. అక్కయ్య కబుర్లు తెలియలేదట.

"ఆ మహానుభావుడిని కట్టుకున్నప్పటినుంచీ బాధలే. నువ్వేదో సంపాయించి పెడతావనీ, సుఖపడవచ్చునని ఆశలు పెట్టుకుంటే, నువ్వు మా కంటికే కనపడకుండా అయావు.

పెద్దది అలా అయింది, పెద్దవాడికి వుద్యోగం లేదు. ఈ కుర్ర కుంక-వీడి రోజులూ నా రోజులూ ఎలా వెడతాయి?" అని రాగాలు మొదలుపెట్టింది.

రెండేళ్ళనాటి రాత్రి అన్నయ్య కొట్టబోవడం, అమ్మ తలకాయ బద్దలు కొట్టుకోవడం; ఆమె దాచిన రెండు వేలూ. అవన్నీ నాకు జ్ఞాపకం వచ్చాయి.

"ఎందుకమ్మా ఏడుస్తావు - అందరూ బాగానే వున్నారుగా ?"

"అందరూ బాగా వున్నా, నాకష్టాలు తప్పలేదు. కట్టుకున్న వాడున్నప్పుడూ కష్టాలే, కడుపున పుట్టిన బిడ్డలు పెద్దయిన తర్వాతా కష్టాలే-ఏం బతుకు?" మళ్ళీ రాగాలాపన మొదలెట్టింది.

"నువ్వేడిస్తే నాకుకోపం వస్తుంది. వూరుకో"అన్నాను.

"ఎందుకు రేణూ, అలా గదవాయిస్తావు. ఏదో పెద్దవారు. అలా వాపోడం సహజం. మనం వోదార్చకపోతే యెంకెవరు వోదారుస్తారు? అదెప్పుడూ, అంతే లెండి. మేము లేమూ-మీకెందుకాభయం ? నన్ను మీ పెద్దకొడుకు అనుకోండి" అన్నారాయిన.

ఏమి నాటకం? నిన్నటిరోజుదాకా పరమ కిరాతకులైన అమ్మా అన్నయ్యా ఆయనకి ఆప్తబంధువులు. మధ్య చెడ్డదాన్ని నేను. ఎంత సులువుగా మంచితనం సంపాయించుకుంటున్నారు, మా ఆయన !

"తొమ్మిది నెలలు మోసి కన్నాను. దానికి నీపాటి ప్రేమాభిమానాలు లేకపోయాయి. ఏదో సినిమాల్లో కుర్రాడి వనీ, అన్యాయం చేస్తావేమోననీ ఆడపిల్లగదా అని తిరగవద్ద న్నాము. పెళ్ళిచేసుకుంటే మేము మటుకు వద్దని అందుమా? నీకేం—కన్నా ముక్కా లోపమా—ఏం తక్కువ? పరాయి అమ్మ కన్నబిడ్డకున్న జాలి అయినా, కడుపున బిడ్డకి లేక పోయే! దాని తండ్రి అంతే - వెధవకచ్చ, చచ్చేదాకా నా వాళ్ళమీద సాధించాడాయన" అంటూ అమ్మ సోది మొదలు పెట్టింది.

ఆయన నవ్వుతూ గెల్చినట్లు నావంక చూశారు. నాకు వొళ్ళుమండిపోయింది. నా దగ్గిరనుంచి కిరాయిడబ్బులు తీసుకుని వాళ్ళంతా నాటకం ఆడుతున్నారు. ఎంత నాటకం!

౬

అటుతర్వాత శ్యామలా, అన్నయ్యా, అమ్మా, వొదినా అంతా రోజూ వస్తూండేవారు. నేను బయటనుంచి వచ్చే వేళకి మావారూ, వాళ్ళూ అంతా నవ్వుతూ ఖబుర్లాడు కుంటూండేవారు. ఇంట్లో వంటమనిషి తీరికలేకుండా వండి వారుస్తూండేది. రోజురోజుకూ ఖర్చుగూడా పెరుగుతూ వచ్చింది.

దసరాపండగ లొచ్చాయి. ఎవరు పిలిచారో ఏమో, అటునుంచి అమ్మావాళ్ళూ, యిటునుంచి వొదినగారూ,

శ్యామలా అంతావచ్చారు. పండగ మూడురోజులూ అమ్మా, వొదినగారూ ఖబుర్లాడుతూ యింట్లో పెత్తనం అంతా చెలా యించారు. పండగ రేపనగా నేనూ, వారూ, శ్యామలా కలిసి బయటకెళ్ళి అందరికీ బట్టలు తెచ్చాము.

ఆ మూడురోజులు వారుకూడా నాతో చాలా సర దాగా ఖబుర్లాడారు. పండగ వెళ్ళిన నాలుగోరోజున అమ్మా, అన్నయ్యా, తమ్ముడూ వెళ్ళిపోయారు. కాని మా వదినా శ్యామలా కదిలే ఎత్తు కనిపించలేదు.

నెమ్మదిగా మా వదినగారే యింటి పెత్తనం అంతా మీద వేసుకుంది. ఇంట్లో పాత పనివాళ్ళని, వంటమనిషినీ తీసివేసింది. నే జబ్బు పడినప్పటినుంచి వంటచేసిపెట్టే-వంటా విడ, తనంతటతనే, వెళ్ళిపోతానని చెప్తే నాకు కష్టం కలిగింది. కారణం అడిగితే;

"మీ చేతికింద నౌకరినిగాని, వదినమ్మగారి చేతికింద కాను. ఆవిడ చెప్పటం, నే చెయ్యటం - రెండింటికీ లంగరు అందదు" అంది వంటామె.

పగలల్లా యింట్లోవున్నా, సాయంత్రం అయేవేళకి శ్యామలా, వారూ యిద్దరు బయటకు వెళ్తూండేవారు. ఒకటి రెండుసార్లు నేను ఇంట్లో వున్నప్పుడు శ్యామల వెంటరమ్మని పిల్చింది. "అదితారా. అది వెంటవస్తే - మనచుట్టూ మను షులు చుట్టివేస్తారు. మనం పోదాంపద" అని ఆపేసేవారు

ఆయన. అసలు నాకు వెళ్ళాలని లేకపోయినా, శ్యామల ముందు నన్ను అలా కించపరచడం భరించలేక పోయేదాన్ని.

అసలే మా యిద్దరిమధ్యా సఖ్యతపోయి అయిదారు నెలలనుంచీ బాధపడ్తున్నాము. దానికితోడు శ్యామలరాకతో మాయిద్దరిమధ్యా సంబంధం పూర్తిగా తెగిపోయింది. అంతకు పూర్వం మాటామాటా అనుకున్నా, ఒకసారి కాకపోతే మరోసారన్నా నవ్వుకుంటూ సంచరించేవారం. శ్యామలా వాళ్ళూ రావడంతో మా ఇద్దరిమధ్యా గోడ ఏర్పడడం మొదలెట్టింది.

ఒకనాడు ఆయన నాతో "మనం యిక్కడ హాయిగా తింటూవున్నాం. అక్కడ మీవాళ్ళు యిబ్బందిపడటం బాగా లేదు. మీ వాళ్ళనిగూడా యిక్కడికే వచ్చి వుండమని మీ అమ్మతో చెప్పాను. నువ్వుగూడా చెప్పు" అన్నారు.

"మీరూ నేనూ ఒకటేగా. ఎవరు పిలిస్తేనేం?" అన్నాను మరి మాట్లాడలేక.

ఆయన కళ్ళల్లోని నవ్వుని యిప్పుడు గూడా మర్చిపోలేను. ఎందుకో ఆ విజయసూచకమైన నవ్వు! అంతా వచ్చి నన్నేం చేస్తారు? వాళ్ళ రాకా, ఎవరిరాకా – నా కిష్టంలేదని వారికి బాగా తెలుసు. అయినా సరే, కావాలని చేస్తూంటే; యింక వాదించి లాభంలేదు. అందరికీ డబ్బిచ్చి బయట ఉంచ వచ్చును; కానీ కావాలని వాళ్ళను నా తలమీద ఎక్కిస్తున్నారు.

అమ్మా అన్నయ్యా వాళ్ళరాకతో యిల్లు మరీ మారిపోయింది. ఇంట్లో పనివాళ్ళందరూ నాకు కొత్తే! నే నొక్కదాన్నే పరాయిదానిలా అనిపించేది. అందరూ ఒక చోట కూచుని ఖబుర్లాడుకుండేవారు. వాళ్ళందరితో కలిసి నవ్వుదామని, ఖబుర్లాడుదామని, వాళ్ళతో కలిసిపోదామని ఎప్పుడన్నా వెళ్ళికూచుంటే, ఆయన సూటీపోటీగా ఏదో ఒక మాట అనేవారు. లేకపోతే నాకిష్టంలేని విధంగా శ్యామలతో వేళాకోళాలు ఆడేవారు. లేక చచ్చిపోయిన మానాన్న ఖబుర్లు ఎత్తుకునేవారు. ఇక అమ్మ నాన్నని తిడుతూవుంటే నాకు కోపం వచ్చేది.

"చచ్చి స్వర్గానవున్న ఆయన్ని ఎందుకమ్మా ఆడి పోసుకుంటావ్?" అన్నాను అమ్మతో పట్టలేక.

"ఆ మనిషి అలాటివాడు కాబట్టి అనుకుంటున్నాము. తప్పా? నీ కిష్టం లేకపోతే వినకు" అన్నారు ఆయన. ఇదంతా ఆయన పనిగట్టుకు ఆడిస్తున్న నాటకంలా తోచేదినాకు.

ఒంటరితనం. నాఇంట్లో నేను పరాయిదాన్ని, యిల్లు కంటె స్టుడియో బావుండేది. బయట ప్రపంచంలో నాకు పరపతి పెరుగుతోంది. పేచీ పెట్టకుండా పనిలోకివచ్చే ఆర్టిస్టు నని పేరు, తెచ్చుకున్నాను. అదీకాక నాపిక్చర్సుకి బాగా డబ్బు గూడా రావడం మొదలు పెట్టింది.

ఇలా రెండేళ్ళు గడిచాయి. ఒక్కొక్కరోజు యింట్లో భోంచేసేదాన్ని; ఒక్కొక్కరోజు కారియర్ స్టుడియోస్‌కే తెప్పించుకునేదాన్ని.

అసలు భోజనంమీద, బ్రతుకుమీద ఏదో నిరాశ పుట్టుకొస్తూవుండేది. సంపాయిస్తున్నది నాకు తెలియకుండా ఖర్చయిపోతూ వుండేది.

రెండేళ్లూ కష్టపడి నిలవజెయ్యగా ఒక పదివేలదాకా బాంకీలో మిగిలింది. ఇంకో పదివేలు నిలవజేసి చిన్నయిల్లూ, చిన్నకారూ కొనుక్కోవాలని అభిలాష.

యిటు యింట్లో చూడబోతే, ఏ అడ్డంకీ లేకుండా, శ్యామలా ఆయనా, భార్యాభర్తల్లా ప్రవర్తిస్తున్నారు. ఆ నడవడి బాగా లేదని అమ్మగానీ, వొదినగారుగానీ ఏ వొక్క సారీ అనుకున్నట్లుగూడా నాకు వినిపించలేదు. అందరూ సహించి వూరుకునేవారు.

మామయ్యా చేయించారని శ్యామల గాజులూ, గొలుసులూ, పట్టుచీరెలూ చూపిస్తూంటే నాకు చిర్రెత్తుకొచ్చేది. స్వంతఖర్చుకు కావాలని నా దగ్గర అడపాతడపా తీసుకున్న వందలేగా అవి! మా వారికి విడిగా కానీ సంపాదన లేదని అందరికీ తెలిసిందే? అలాంటప్పుడు శ్యామల మామయ్యా కొన్నారని చీరెలూ, నగలూ చూపిస్తూంటే నవ్వాలో ఏడవాలో తెలిసేది కాదు.

ఒకసారి నేను ఇంటికొచ్చేవేళకి మావారు, అప్ప గార్ని కేక లెయ్యడం, ఆవిడ కన్నీళ్ళతో ఏదో ప్రాధేయ పూర్వకంగా అడగడం నా చెవిని పడింది. నేను మామూ లుగా మేడమీద నా గదిలోకి వెళ్ళిపోయాను. స్నానంచేసి చీరమార్చుకు వచ్చి సోఫాలో నడుంవాల్చాను.

మా వదినగారు గదిలోకివచ్చి కుర్చీ లాక్కుని సావ కాశంగా కూచోడం నాకు ఆశ్చర్యం కలిగించింది. ఏడాది లోపల ఆవిడ నాగది చాయలకే రాలేదు. ఆవిడే గాదు. ఇంట్లో ఎవరూ నా గది ప్రాంతాలకి రారు. ఆయన మటుకు డబ్బు అవసరంగానీ, ఏదైనా వ్యవహార విషయమైన పనిగాని వుంటే వస్తారు.

"పిల్ల ఎదిగి ఇంట్లోవుంది. దాని పెళ్ళిమాట ఏం చేసి నట్టు?" అంది వదినగారు.

"నన్నడుగుతారేం? శ్యామల ఎదిగిందని మీ కంటి కివ్వాళే కనపడిందా?" అన్నాను సమయం దొరికిందికదా అని.

"ఇన్నాళ్ళుబట్టీ చిన్నపిల్ల అని వూరుకున్నాను. అసలు చిన్నప్పటినుంచీ పరాయి సంబంధంమాట అనుకోలేదు. ఈ నాటికి అలాటి అవస్థ పట్టింది" అంది కళ్ళు వత్తుకుంటూ.

అయిదేళ్లవస్తోంది మా పెళ్లయి! ఎప్పుడో పోయిన ఆశలకి యీనాడు ఏడుపెందుకు? పెళ్ళయితే కాలేదుగాని మిగతావి ఏమి ఆగుతున్నాయి! కూతురిని తమ్ముడికి చేసు

కొన్నదానికంటే ఎక్కువ సుఖపడుతున్నారుగా, అయినా, యివ్వన్నీ నాకు అనవసరం.

"దానికి యీ శ్రావణమాసంలో పెళ్ళిచేస్తే బాగా వుంటుంది."

"నాతో చెప్తారేం? మీ తమ్ముడితో చెప్పండి. ఇంటి కయినవారు. ఎక్కడన్నా వెతికి తెస్తారు పిల్లాడిని" అన్నాను.

"మాట్లాడితే 'మీ తమ్ముడు, మీతమ్ముడు' అని ఎత్తిపొడవనక్కర్లేదు. వాడువినిపించుకుంటే, నీదాకావస్తానా? దానికి పెళ్ళిచెయ్యక దగ్గర పెట్టుకొని పెంచుకుంటాడట" అంది దీర్ఘాలుతీస్తూ.

"బాగానేవుంది."

" 'బాగానేవుంది' అంటావు. నీకేం-ఎద్దుపుండు కాకికి ముద్దా—అన్నారుట. వాడికీ దానికీ ముడివేసి కళ్ళముందే వుంచుకుందామంటే మధ్య వస్తివి. ఏదో అయినవాళ్ళుకదా అని వచ్చివుంటే, వాళ్ళిద్దరూ అట్టా తిరుగుతుండిరి. రేపు నా పిల్ల అధోగతిపాలవుతే—నీకా బాధ, నాకా?"

"వాళ్ళిద్దరూ ఎల్లావున్నారో రెండేళ్ళబట్టీ మీరు, నేనూ అందరం చూస్తూనేవుంటిమి. పోనీ, పెద్దవారు మీరన్నా మందలించకపోతే, యిలా కాకపోతే, మరింకెల్లా అవుతుందను కున్నారు?"

"ఇల్లా అయిందని కాదు నా బాధ, మొదటినుంచీ అను కున్నాం. నువ్వు బయటదిరిగినా, ఆలనాపాలనా చూసేందుకు అది యింట్లో వుంటుంది, యిద్దర్నీ చేసుకుంటాడు-అనుకున్నాం. ఇప్పుడు "దాన్ని పెళ్ళిచేసికోను. నలుగుర్లో తిరిగే నా పెళ్ళా నికి తలవంపులు. శ్యామలని అలాగే యింట్లో వుండనీ"— అంటున్నాడు. ఇదే నీ భర్త ప్రయోజకత్వం. అందుకని దానికో సంబంధం వెతకమంటున్నాను — నీ కాపరం చక్క బడటానికే నేనూ చెపుతున్నది" అంది.

ఎంత ఆలోచన! శ్యామలనిచ్చి పెండ్లిగూడా చెయ్యా లనే ! బాగానేవుంది. నా కళ్ళముందే అన్ని ప్లానులూ జరిగి పోతున్నాయి.

"నా కాపరం చెడి మూడేళ్ళు కావస్తోంది. అది చక్క బడలేదని మీరు చింత పెట్టుకోకండి. వాళ్ళిద్దరి సంగతీ నాకు తెలీదు. ఈవ్యవహారంలో నాకేమీ సంబంధంలేదు"అన్నాను విసుగొచ్చి.

"కాపరం చెడింది, కాపరం చెడింది" అని అలా గింజుకుంటావు. నువ్వు పగలూ రాత్రీ అలా సినిమాల్లో తిరు గుతూంటే, ఏ మొగాడుమటుకు ఏం జేస్తాడు? భార్యఅంటే, యింట్లో కాస్త మంచి చెడ్డా చూసుకోవాలా? —అందుకని మేనగోడలంటే ప్రీతిపడి ఏడుస్తున్నాడు. అసలు దాన్ని చేసు కుంటే, ఏ బాధా లేకపోను. ఇవ్వాళ కాకపోతే, రేపన్నా

దాన్ని వాడు కట్టుకోడం ఖాయం. నలుగురులో తిరిగేదానివి నీ కాపరం వీధిలో పడకుండా, దానికి ఓ కుర్రవాడిని తీసుకొచ్చి చెయ్యి, నీమంచికే చెపుతున్నాను"అని వెళ్ళిపోయింది.

ఆ రాత్రంతా ఒక్కసారికూడా కునుకురా లేదు.ఏమిటీ జీవితం ? ప్రేమించి పెళ్ళాడిన భర్త, కళ్ళెదురుగుండా మేనకోడలుతో కాపరం వెలిగిస్తున్నాడు. పైగా వాళ్ళందరి సుఖానికి నేను కష్టపడి సంపాయించాలి. అటు వదినగారు – నలుగుర్లో నవ్వులపాలు కాకుండా శ్యామలకి పెళ్ళిచెయ్యమని బెదిరిస్తోంది. ఇటు తల్లికి – తనసుఖం, సంసారం యిలాటివి_ పట్టనే పట్టవు. కూతురి జీవితం నాశనం అవుతున్నా, అల్లుడి పక్షమే చేరుతుంది. పైగా పెద్దకొడుక్కి పెళ్ళిచేయ్యలేదని దెప్పుతుంది అమ్మ. దూరానవున్న అక్కయ్యని నేను తీసుకరాలేదనీ, అదికూడా పడితినడం లేదనీ యింట్లో ఏడుపు. ఏమిటీ మనుషులు ? నే నెందుకు బతుకున్నాను ? ఎవరికోసం బతుకుతున్నాను? ఆఖరికి యీ బాధలన్నీ చెప్పుకునేందుకు స్నేహితులన్నా లేరే నాకు ! ఆయిదేళ్ళ దాంపత్యం తర్వాత నాభర్త మళ్ళీ పెళ్ళిచేసుకుంటే నలుగురూ ఏమంటారు ? ఇప్పటిదాకా, తెలిసినవాళ్లు మాది ఆదర్శదాంపత్యమని అనుకుంటున్నారు. యిద్దరిమాట ఒకటి అన్నట్లు ప్రవర్తిస్తున్నాం. ఈయనపెళ్ళిచేసుకుంటే నాబ్రతుకు నవ్వులపాలు కాదూ !

తెల్లారిగట్ల అయిదింటికోక నిశ్చయానికి వచ్చాను. శ్యామలకి వరుణ్ణి తెచ్చి పెళ్ళిచేస్తే-శ్యామల అత్తవారింటికి వెళ్ళిపోతుంది. కొన్నాళ్ళకి ఒదినిగారిని కూడా పంపివేయ వచ్చును. ఇంక, అమ్మా, అన్నయ్యలు, వాళ్ళది యిట్టే తేల్చేయవచ్చు. వాడికి ఎక్కడున్నా వుద్యోగం చూపించి, విడి కాపరం పెట్టిస్తేసరి. అప్పటికి యీ సంసారం ఓదారిని పడుతుంది. మా యిద్దరి అన్యోన్యంమాటా దేముడెరుగు. ఇల్లు నరకబిలంలా ఉండకుండావుంటే అంతేచాలు.

మొదట్లో శ్యామల పెండ్లి విషయంలో నేను కలి పించుకునేవేళకి తాడిప్రమాణాన లేచారు వారు నామీాద. ఒక నెల్లాళ్ళు పోయాక, మళ్ళీ ఏమనుకున్నారో, తనకు తెలి సిన సంబంధాలు చూడటం మొదలుపెట్టారు. శ్యామలకి నచ్చితే వారికి నచ్చకా-యిద్దరికీ నచ్చితే మా వదినగారికి నచ్చకా-యిలా ఆరునెలలు గడిచింది.

చివరికి మా వదినగారి అత్తవారివైపు దూరపు బంధు వుల అబ్బాయిఒకడున్నాడట. ఆసంబంధం అందరూ ఆమో దించారు. నాకుమటుకు ఒక విషయంలో కించగావుండి. ఆ పిల్లాడికి తల్లిదండ్రులు లేరు, ఉద్యోగంలేదు. శ్యామలని ఎక్క డికి తీసుకెళ్తాడా అని అనుమానం పట్టుకుంది.

"ఉద్యోగం లేదాయెను. మరి పెళ్ళయినమర్నాటినుంచీ పోషణఎల్లా?" అన్నా పెళ్ళికబుర్లు మాట్లాడుతూంటే.

"బి. ఏ. పాసయ్యాడా? ఎక్కడో ఒకచోట ఉద్యోగం దొరక్కపోతుందా? పెళ్ళయిన మర్నాడే పిల్లని పంపుతామా ఏమిటి? యీ లోపల ఏదోపనిలో ప్రవేశిస్తాడులే?" అంది వదినగారు.

"పిల్లవాడికి ఉద్యోగం దొరికేదాకా యిద్దరూ ఇక్కడే వుంటారు. పిల్లాడుకూడా మనలో కలిసిపోయే మనిషే" అని తేల్చారువారు.

నేను నిర్ఘాంతపోయాను. శ్యామల వెళ్ళిపోతుంది కదా అని పెళ్ళికి పూనుకుంటే – ఈ యింటి నడికప్పుమీద పడు కునేందుకు మరో మహానుభావుడు కూడా వస్తున్నాడన్న మాట. బాగుంది. ఇటు ఏడుతరాలవాళ్ళనీ, అటు ఏడుతరాల వాళ్ళనీ పోషించేందుకు, నాదగ్గిర దానపట్టా పొందినట్టుగా వుంది వాళ్ళవైఖరి.

పెళ్ళి స్థిరపడింది. కట్నం కానుకలూ లేకపోయినా, కుర్రాడి బట్టలకీ, అతని కివ్వాల్సిన లాంఛనాలకీ, శ్యామల నగలకీ, చీరెలకీ నాలుగువేలు ఖర్చయాయి.

పెళ్ళిఖర్చూ ఊళ్లో నలుగురికీ విందులూ, పాటకచ్చేరీ యివన్నీ పెద్ద ఎత్తులోనే జరిగాయి. అంతాకలసి, నేను రెండేళ్ళనుంచి దాచిన పదివేలూ, మరో మెంబర్ని యింటికి తెచ్చుకునేందుకు ఖర్చుచేశాను.

మళ్లీ నేను మొదటికే వచ్చేశాను. ఇంట్లో యింకెడు జనం. కొత్తఅల్లుడు. బాంకులో ఒకవెయ్యికూడా లేదు. నెలకి

వచ్చే పదిహేనువందలూ కటాకటిగా సరిపోతున్నాయి. పెండ్లయి నప్పటినుంచీ, శ్యామలకీ-వారికీ - మధ్యదో స్తీ తగ్గి పోయింది. శ్యామల భ ర్తమటుకు నాకు బాడీగార్డులా, నాతో పాటు స్టుడియోలకీ, ఫన్ క్షన్లకీ వస్తూండేవాడు.

ఆ కుర్రవాడిలో ఫీలింగ్స్ చచ్చిపోయాయేమో నని పించేది. ఇది అత్తవారి యిల్లుగాదు, జమీందార్ల యిల్లు అన్నట్టు వొదిగి వొదిగి ప్రవర్తించేవాడు. మేనకోడలి భ ర్త లాగా కాక, నాచేతికింద మనిషిలా ప్రవర్తించేవాడు. అతన్ని చూ స్తే జాలీ, అసహ్యాం కలిగేవి.

1947లో అప్పటికియుద్ధంఅయిపోయింది.పూర్వంలాగా కాక సినిమాలు తియ్యడానికి చాలామంది బ్లాక్ మార్కెట్టులో సంపాయించిన డబ్బుతో బయలుదేరారు. వీధికో సినిమా కంపెనీ లేచింది. నా పిక్చరుకి డబ్బు రావడం వల్లా నేను కాస్త పాతకాగ నవడంవల్లా చాలామంది ప్రొడ్యూసర్లు నన్ను బుక్ చేసుకున్నారు.

పూర్వంకంటె నా రేటుకూడా పెరిగింది. ఒక్కొక్క సినిమాకి పదివేలనుంచి పాతికముప్ఫై వేలదాకా పెరిగింది. బ్లాకూ వైటూ - ఆ లెక్కలన్నీ ఆయన చూసేవారు. ఏ మయితేనేం, ఆ ఏడు ఒక లక్షదాకా సంపాయించాను.

అసలు, నా జన్మలో అంతడబ్బు కళ్ళచూస్తానని ఏ నాడూ అనుకోలేదు. నాలుగు పిక్చర్లకీ కలిపిన ఎడ్వాన్సే ముప్పయివేలుపైన వచ్చింది. ఐదేళ్ళనుంచీ అనుకుంటున్న

కారూ, యిల్లూ కొనాలని నిశ్చయించుకున్నాను. అయితే ఆ డబ్బుపెట్టి యిల్లు కొనటం మావారికి యిష్టంలేదు.

చిట్టచివరికి, ఒక మేడా, కారూ కొన్నాను. యిల్లూ కారూ నాపేరనే కొనుక్కున్నందుకు ఆయనకు చాలా కష్టం తోచింది.

"ఇల్లు నాపేర పెడితే కొరుక్కుతింటా ననుకున్నావా? పెళ్ళయి అయిదేళ్ళయినా, నామీద నీకు బొత్తిగా నమ్మకం లేదుకదూ?"

"ఎవరిపేర పెడితేనేం. అందరం యింట్లో నేవుంటాంగా— కారు అందరం వాడుకునేందుకేగా! నాకు స్టుడియో కారు రానేవస్తుంది, అసలు మీరు వాడుకునేందుకు కారుకొన్నది" అని "నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష"—అన్నట్టు ఆయనను వుబ్బెయ్యడం మొదలుపెట్టాను. ఈ ఇల్లుగోల అంతతొందరగా తేలుతుందని అనుకోలేదు. మంచిమాటల్తో నెమ్మదిగా వారి చేత సాక్షి సంతకం పెట్టించాను లాయరు చెప్పినట్టు.

గృహప్రవేశంనాడు పెద్ద పార్టీ యిచ్చాము. మాకు తెలిసిన పెద్దవారూ, సినిమావాళ్లూ ఒక వెయ్యిమందిదాకా వచ్చారు. ప్రతివాళ్లూ మా దాంపత్యాన్ని చూసి మెచ్చుకోవడమే. నా అదృష్టానికి చాలామంది తారలు అసూయపడ్డారు. గృహప్రవేశమప్పుడే అక్కనీ బావనీ రమ్మనమని ఆహ్వానించాము.

నాన్న పోయాక అక్కను చూడటం అదే మొదటిసారి. దాని యిద్దరుపిల్లలూ, బావగారుకూడా వచ్చారు. ఆయన

నాపట్ల చాలా గౌరవం చూపారు. వెనక ఆయన దృష్టిలో మేము అమర్యాదస్థులం. అందుకనే, అక్కయ్యని యిన్నేళ్ళ బట్టీ మా యింటికి పంపలేదు. ఇప్పుడు యీడబ్బుతో మేము గొప్ప మర్యాదస్థులమై పోయాము. అక్కయ్యా నా సిరిసంపదలు తలుచుకు అదేపనిగా సంతోషించింది.

నాకు నవ్వొచ్చింది. అసలు జీవితాలే ఇంత కాబోలు. పైకంతా నాఅంత అదృష్టవంతురాలు లేదనిపిస్తుంది చూసే వారికి. ప్రతివారూ రేణుకాదేవికి తక్కువేమిటి? అనుకుంటారు. భర్త, అందులో అందమైన భర్త, పైగా ప్రయోజకుడు. అతని వల్లే యీామె యింతపైకి వచ్చింది! కావలసినంత కీర్తి, ఇంట్లో చుట్టాలూ పక్కాలూ అందరూ నాఅదృష్టాన్ని స్తోత్ర పాఠం చేసేవారే!

అంతేగాని, రేణుకాదేవికి ఒక హృదయం వుంది. ఈ బంగారు గోడలవెనుక ఆమెగుండె గిలగిల కొట్టుకుంటోందని, ఏవొక్కరు క్షణం ఆలోచించరు. అసలు వూహించుకోన రేమో కూడానూ! ఎందువల్లనంటే, యీ బాధలన్నిటినీ పైకి కనపడకుండా కప్పే చిరునవ్వుని రేణుకాదేవి నిద్రలో కూడా మర్చిపోకుండా, తన అధరంమీద ఉంచుకుంటుంది. కాని రేణుక కుమటుకు మనము నచ్చచెప్పుకునేందుకు, ఒక్క ప్రాణి గూడా యీ లోకంలో కనపడలేదు. ఆమెను వొక్కసారి కన్నులపండుగగా చూడాలని తహతహలాడే లక్షలాది జను లున్నారు కాని యింత విశాలప్రపంచంలో ఆమెకు ఒక్క స్నేహితురాలుకూడా లేదు.

౭

వచ్చిన రెండురోజులదాకా అక్కయ్య తీరిక వున్నప్పుడల్లా నాతో ఖబుర్లాడుతూ నవ్వుతూ వుండేది. ఆఖరికి నాది అనుకునే మనిషి ఒకత్తె దొరికింది కదా అని కాస్త సంతోషించాను. కాని ఆ సంతోషం వారంరోజులు తిరగకుండానే మాయమయింది. అక్కయ్యకూడా నాతో చనువు తగ్గించింది, మరిదిగారితో ఛలోక్తులు పలకడంలోకి దిగింది. దానికీ నేను ఏమీ ఆశ్చర్యపోలేదు; అది నాకు అలవాటే.

అసలు అక్కాబావా వచ్చినరోజే మావారు తోడల్లుడిని రెండుచేతులా ఆహ్వానించారు: వారు ఇన్నాళ్ళనుంచి రానందుకు చాలా కోపం వచ్చినట్లు మాట్లాడారు. మా బావకు తనని ఇన్నాళ్ళనుంచీ పిలువలేదనే సంగతే తట్టలేదు. పైపెచ్చు తనే మొండిగా రాలేదనీ, ఏదో తప్పుచేసినట్టూ తలవంచుకున్నాడు.

ఎంత కొత్తవారినికూడా ఇట్టే పల్కరించడం, వారితో ఆప్తమిత్రుడల్లే మాట్లాడటం, మావారికి అలవాటు. అవతలవాళ్ళమీద యిష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండానే వచ్చేస్తాయి తేనె పలుకులు. అవతలవాళ్ళని మాటల్తో బోల్తా కొట్టించి, ప్రబలంగా తనవైపుకి తిప్పుకునే విద్యలో ఆయన ప్రవీణులు. అసలు అలాటి ఆకర్షణలోనే నేనూ పడి, వారిని పెండ్లిచేసుకుని వుంటాను. ఆయన నిజస్వరూపం నాకుగాని

మరొకళ్ళకు తెలీదు. చివరికి అక్కయ్యనీ, బావనీగూడా తమ ఆత్మీయవర్గంలో చేర్చుకున్నారు మావారు.

మా బావకి ఏం వుద్యోగమో నాకయితే తెలీదుగాని ఆయనగూడా వుద్యోగంమానేసినట్టు, యిక్కడే వుండిపోవడం మొదలుపెట్టాడు. అసలు వుండిపోవడానికిమా వారుబలవంతమే కారణం. బావ అప్పుడప్పుడెల్లి ఒక పదిహేనురోజులు వాళ్ళ వూళ్లోవున్నా; మిగతారోజులు ఇక్కడే గడిపేవాడు.

ఇప్పుడు నా బాడీగార్డ్సుపని ఇద్దరు పంచుకున్నారు. శ్యామలభర్తా మాబావా. వాళ్లు రావడం అనవసరం అని అన్నాను. కాని వాళ్ళు రావటం మానలేదు.

ఇంత పెద్దదానివయ్యావు. మొగవాడు పక్కన లేకుండా వెళ్ళడం మంచిది కాదు" అంటారాయన.

ఆ వేసవిలో మా అన్నయ్యకు పెళ్ళిచేశాను. ఆ అమ్మాయి తల్లిదండ్రులకి ఒక్కత్తే కూతురు. యిల్లరికం అడిగారు. అంతకంటేనా? ఒకరు తగ్గినా, తగ్గినట్టే. నాలుగువేల రూపాయల ఖర్చుతో యింటిల్లపాదీ తర్లివెళ్ళి, పెళ్ళిచేయించి వచ్చాం.

మా బావ వూళ్ళోలేదు. ఆనాడు హాఫ్ కాల్‌షీట్. ఆరున్నరకి యింటికొచ్చాను. హాల్లో ఎవరూలేరు. వెనక ఇంట్లోఅమ్మా-వదినా పచ్చీసు ఆడుకుంటున్నారు. శ్యామలా ఆమె భర్తా యిద్దరూ సినిమాకి వెళ్ళారనీ, అయ్యగారు పైన వున్నారనీ పనికుర్రాడు చెప్పాడు.

నా గదికి వెళ్ళేందుకు, చిన్న హాలూ, వరండా, వారి గది-దాటి వెళ్ళాలి. వారిగదితలుపులు ఘడియ వేసి వున్నాయి. నిద్దరపోతున్నారేమో ననుకున్నాను. కాని వారి గదిలోంచి నవ్వులూ, గాజుల చప్పుడూ వినిపించింది. నాకు ఆశ్చర్యం వేసింది. ఈవేళప్పుడు ఆయన గదిలో ఏ స్త్రీ వుందా అని. పూర్వమయితే శ్యామలకదా అని, మామూలుగా వెళ్లిపోయే దాన్ని. శ్యామల ఇంట్లో లేదాయె. ఇంకెవరు చెప్మా అని ఆలోచించాను. పరాయి స్త్రీలను ఇంట్లోకి, నాఇంట్లోకి తెస్తారా ? అని వొళ్ళు తెలియని కోపంవచ్చింది. తలుపు తట్టి నాలుగూ అడిగేద్దామనుకున్నాను. ఆ నవ్వు మళ్ళీ వినిపిం చింది. అది అక్కయ్య నవ్వులావుంది.

నా కాళ్లు తేలిపోయాయి. నా గదిలోకి యీ దేహాన్ని చేరవేశాను. అనుమానం దృఢపరచుకునేందుకు, నా గది తలుపు కాస్త తెరిచి, మంచంమీద పడుకున్నాను.

కాసేపటికి తలుపు తెరుచుకు, అక్కయ్యా, వెనక ఆయనా వరండాలోకి వచ్చారు. నాగదితలుపు తెరిచివుండటం చూసి అక్కయ్య నిర్ఘాంతపోయింది. కాని నేనామె ముఖం లోకి చూడలేదు.

ఆ సాయంత్రమే ఆరంభం అయింది ఈ గుండెనెప్పి. ఆ రాత్రి భోంచెయ్యలేదు. రాత్రి పన్నెండు కొట్టింది. నాకళ్లు మూతలుపడటంలేదు. వరండాలోఅడుగులచప్పుడుతో తలెత్తి చూశాను. చేతిలో సారాసీసాతో ఆయన పైడాబామీదకి వెళ్ళారు. ఆవేళ నేను స్టుడియోనుంచి ఆ సమయంలో రాక

పోయినా బాగుండేది. ఎంతైనా, యిలా దొరికిపోవడం ఆయన కెంత చిన్నతనం! నాకు మా దాంపత్యపు మొదటిరోజులు జ్ఞాపకం వచ్చాయి. అనిల్ బాబు చేతిలోని సీసా లాక్కుని ఆయన వొళ్ళో తలపెట్టుకు పడుకుని, పెద్దపెట్టున ఏడవాలని పించింది, 'మన మెక్కడికయినా వెళ్ళిపోదాం—ఒక నెల్లాళ్ళ పాటు' అని ఆయనను ప్రార్థించాలనిపించింది.

కాని నన్ను నేను గదమాయించుకున్నాను. తప్పు చేసింది నేను కాదు—ఆయన. అంచేత, రాజీపడవలసింది ఆయన. 'నా తప్పులు మర్చిపో. నన్ను నువ్వుగాక ఎవరు మన్నిస్తారు?' అని ఆయన నా గదిలోకి వచ్చివుంటే...

మూడు కొట్టేవరకూ ఆయనకోసం ఎదురుచూస్తూ కూచున్నాను. ఆఖరికి ఆయనగది ఘడియవేస్తున్న చప్పుడు వినిపించింది. అక్కడితో అవనిక జారింది.

అప్పటినుంచి నాకు గుండెనెప్పి, ఆయనకి తాగుడూ యిద్దరం చెరోటీ పుచ్చుకున్నాం.

అన్నిటికన్న విచిత్రం ఏమిటంటే, నేను మానసికంగా యింత బాధపడుతున్నా, ప్రతి పిక్చర్లోనూ - నాకే ఆశ్చర్యం కలిగేటంత బాగా నటించేదాన్ని. ఆ సంవత్సరంలో నేను నటించిన సినిమాలకి కనకవర్షం కురిసింది. అసలు నా చక్రం తిరిగింది.

ముప్పైవేలు, నలభైవేలు యిలా యాభైదాకా ఇస్తా మని ప్రొడ్యూసర్లు ఎగబడటం మొదలుపెట్టారు. ప్రజలకి నా

మీద వెర్రి వ్యామోహం పట్టుకుంది. అందుచేత వీలువున్నన్ని కాంట్రాక్టులు వొప్పుకున్నాను. ఇంట్లో ఎన్ని భేదాభిప్రాయాలున్నా, బయటి విషయాల్లో మటుకు, ఆయన సలహాలు యిస్తూండేవారు. అనిల్ బాబులాంటి మొగవాడు పక్కనుండటం ఎంత ప్రయోజనకరమో నాకూ తెలిసివస్తోంది.

మరుసటి సంవత్సరంలో రెండో కారు కొన్నాను. కొత్త కారు-పెద్దదీ, ఖరీదు కలదీ. నేను పాతకారు తీసుకెళ్తానంటే ఆయనే వద్దనీ పెద్దతార పెద్దకారులో వెళ్ళాలనీ అనేవారు.

నాకు పేరు ప్రఖ్యాతులూ, సిరిసంపదలూ రాడడంతో చాలామంది ఆడపిల్లలు నాఅంత అవుదామని ఇళ్ళలోంచి పారిపోయి వస్తూండేవారు, నా దగ్గరకు. అలా నలుగురయిదుగురువస్తే యీ సినిమారంగంలోని కష్టనిష్టూరాలు వాళ్ళకి చెప్పి, మంచిమాటల్తో వెనక్కి పంపేశాను.

ఒకసారి సాయింత్రంపూట ఎవరో అతిథులొచ్చారు యింటికి. వారు వెళ్ళాక ఇంటిఎదుటి లాన్సులో కుర్చీల్లో కూచుని మాట్లాడుకుంటున్నాము, వారూ నేనూ. ఏముంది-డబ్బుగొడవలే. డబ్బు మినహా మిగతా విషయాలుమాట్లాడుకోడం మేము మానేశాము. గేట్లోంచి ఒక టాక్సీవచ్చి మా ముందు ఆగింది. అందులోంచి పద్దెనిమిదేళ్ళ అమ్మాయి దిగింది.

నాకు ఆమె ఎవరో తెలియదు. ఎందుకు వచ్చిందో తెలీదు. కుర్చీలో కూర్చున్నాక చెప్పింది. పేరు రాధ. స్కూలు ఫైనలు చదువుతూ మానేసి వచ్చిందట-సినిమాల్లో చేరేందుకు.

పిల్ల చాలా చక్కగా వుంది. చక్కటి కళ్లూ, చిన్న నోరు, మంచి తీరయిన విగ్రహం.

"చదువుకున్న దానవు-నీ కెందుకమ్మా యీ సినిమా పిచ్చి? మేడిపండు తల్లీ యిదంతా!" అన్నాను.

"మీలాటివాళ్ళని చూశాక నాకు కళాసేవ చెయ్యాలనే పట్టుదల మరీ హెచ్చుతోంది" అంది నన్నూ మా ఆయ ననూ వుద్దేశించి.

మేము ఆ సాయంత్రం వేళ ప్రేమైక దంపతుల్లా కనిపించి వుంటాం మా వెర్రిపిల్లకి. ఎంతో హితబోధ చేసి, ఆ నాటికి ఆ అమ్మాయిని పంపించివేశాను.

ఐదు నెలల తర్వాత ఒక వుదయం వేళ పేపరు చూసుకుంటుండగా రాధ మళ్ళీ వచ్చింది. మనిషి బాగా చిక్కిపోయింది. చెక్కిళ్ళు వడలిపోయాయి.

"ఏం జెయ్యను? యింటికి ఏ మొహం బెట్టుకు వెళ్లను? ఈ సంగతి తెలిశాక వారు పూర్తిగా రావడం మానేశారు" అని ఒకటే ఏడుపు.

"ఎవరూ?" అని అడిగాను.

"అనిల్ బాబుగారు" అంది.

రాధని సేవాసదనంలో జేర్పించి, పురుడుపోయించాను. పిల్లను ఎవరో తీసుకున్నారు. తర్వాత స్కూలుఫైనలు పాస యింది. ఇప్పుడేదో వుద్యోగం చేసుకు బతుకుతోంది.

ఆ ఏడాది చివరిలో అరవైవేలు చేసే మేడ మరొకటి కొన్నాను. చేతిలోకి డబ్బువస్తే బంగారంగాని, యిల్లూ

భూములుగాని కొనడం మొదలుపెట్టాను. ఎంత తక్కువ అనుకున్నా, కనీసం వెయ్యిరూపాయలయేవి ఇంట్లోకి ప్రతి నెలా; అదిగాక వారు నాలుగైదువందలు సొంతఖర్చులకితీసుకునేవారు.

నేను డబ్బు రెండుచేతులా సంపాయిస్తున్నాను కనక అంత కష్టంగా వుండేదికాదు.

ఒకనాడు సెట్ మీాదకు వెళ్ళాంటే మాడైరెక్టరు ఒక అతన్ని తీసుకొచ్చారు.

"ఈయనపేరు గోపాలరావు. మంచి అభిరుచులుగల మనిషి. మన ఫీల్డులో ప్రవేశిద్దామని అనుకుంటున్నాడు. అభ్యుదయ దృక్పథంగల పిక్చరు తియ్యాలని అభిలషిస్తున్నాడు" అంటూ నాకు పరిచయం చేశారు.

గోపాలరావు సన్నగా చామనచాయగా వుంటాడు మనిషి చాలా పొడగరి. కళ్ళు ఎప్పుడూ ఏదో ఆలోచనగా చూస్తూ వుంటాయి. ఆయనా నేనూ కాసేపు రెండుమాటలు మాట్లాడుకున్నాం మర్యాదకు.

ఆ తర్వాత వారంరోజులపాటు ప్రతిరోజు నా షూటింగుకు హాజరవుతూండేవాడు. నా నటనని చాలా జాగ్రతగా పరిశీస్తూండేవాడు. అలాటివి నాకు అలవాటే కనక కొత్తగా ఫీలవలేదు.

ఆ రాత్రి మేకప్ అయిపోయింది.

యింకా సెట్ మీాదకు వెళ్ళేందుకు చాలా టైముందని-ఆరుబయట కుర్చీ వేసుకుని, చుక్కలుతో మెరిసే ఆకాశాన్ని

చూస్తూ కూచున్నాను. నాకు కాస్త ఎడంగా కూర్చున్నాడు గోపాలరావు. నేను మాట్లాడలేదు. నా వంటరితనాన్ని అతను పోల్చుకుంటున్నట్టున్నాడు. నన్ను అనవసరంగా పలకరించక పోవడంవల్ల నా కతనిమీద గౌరవం ఏర్పడింది.

ఆ తర్వాత యిద్దరం మాట్లాడుకుంటూండేవాళ్ళం.

"మీకు పనిలేదుగా–ఎందుకిలా యీమనుషులుచుట్టూ తిరుగుతారు" అన్నాను ఒకరోజు.

"మొదట్లో సెట్ మీదమిమ్మల్ని చూద్దామనివచ్చాను. నేను తీద్దామనుకున్న సినిమాలోకి పనికివస్తారో లేదో చూద్దా మని రెండోసారి వచ్చాను. క్రమేపీ, మిమ్మల్ని చూడటం తప్పించుకోలేని అలవాటయింది" అన్నాడు.

"మీరు ఏవో కథలు రాస్తారుటగా?" అని ధోరణి తప్పించాను.

"మీకు పనికివచ్చేవి కాదు" అన్నాడు.

"అంటే?"

"ప్రేమకథలు కాదు" అన్నాడు.

"మరి ఎల్లాంటివి?"

"ప్రేమ అనేది అందరూ అనుకునేసౌఖ్యంకాదు. అది గమ్యంకాదు, ఒకమార్గం. ప్రేమించగల మనుష్యులకువోటమి లేదు..." అంటూ ఏమిటేమిటో చెప్పుకుపోయాడు.

మరొకనాడు, "మీ స్వభావంలో సరళతా, సౌమ్యం లేవంటే నేను నమ్మను. మీకు మాటలురావన్నా నేను నమ్మను. ఎందుకు మీ మనసుకి తాళం వేసుకున్నారు?" అన్నాడు గోపాలరావు.

"అలాగా?"

"మనం ముందొకసారి నిశ్శబ్దంగా ఒకగంటసేపు కూచున్నాం, జ్ఞాపకంవుందా? ఆ నిశ్శబ్దంలో, మాటల్లో అర్థం గానివి ఎన్నో, మీగురించి నాకు అర్థం అయాయి. మీకు జీవితంలో ఏదో పెద్దబాధవుంది. ఆ సంగతి మనసిచ్చి చెప్పుకోవడంలో ఎంత హాయివుంటుందో మీకు తెలీదు. ఏమిటో లెండి. మీ మనసులోని బాధ చెప్పమని అడిగేందుకు నే నెవరిని?" అన్నాడు.

'నేనెవరిని'అని గోపాలరావు అంటున్నప్పుడు అతని మీదెంతో ఇష్టం కలిగింది నాకు. అతన్నిచూస్తే ముచ్చట వేసింది. నా చుట్టూ కనిపించే మనుషులందరికంటే అతను తెలివిగలవాడు. కాని 'వినయము' అంటే ఏమిటో అతన్ని చూసి నేర్చుకోవాలి మనుషులు.

ఈలోపల కెమేరామేన్‌వచ్చి నా పక్కకుర్చీలో కూలబడ్డాడు. అంతటితో మా సంభాషణ ఆగిపోయింది. లేకపోతే నాగోడు అతనిముందు వెళ్ళబోసుకునేదాన్ని. అసలు ఇన్నాళ్ళకి నేను బాధపడుతున్నానని గ్రహించగల మనిషి ఇతనొకడే కన్పించాడు.

డైరెక్టరూ, ప్రొడ్యూసరూ కూచున్నప్పుడు గోపాలరావు తను సినిమాకోసం రాసిన కథ చదివి వినిపించాడు. నేను చివరిదాకా డబ్బు అడగకుండా యాక్ట్‌చేస్తే ప్రొడ్యూసరు పెట్టుబడి పెడతానన్నాడు. నేను సరేనన్నాను.

గోపాలరావు ఒకటికి రెండుసార్లు కలుసుకుంటున్నా

డని ఆయన చెవిని పడింది. ఆ మర్నాడు ఇంట్లో వారికి నాకూ పెద్ద తగాదా.

"ఆ గోపాలంగాడి సినిమాలో డబ్బు లేకుండా యాక్టు చేస్తావ్?" అన్నారు.

"నా యిష్టం-మీ కేం!"

"పాపం పదిహేనురోజుల్నుంచి రాత్రిళ్ళు లాన్సులో కూచుని నూరిపోస్తున్నది యిదే కాబోలు" అన్నారు కవితో.

"చూడండి_నేను చెయ్యదలుచుకుంది చేసితీరుతాను. మీరు నన్ను అడ్డుపెట్టి లాభంలేదు" అన్నాను.

స్టాండ్ మీదవున్న పట్టుచీరె పరుసచించి, గదిలోంచి విసురుగా వెళ్ళిపోయారు.

మళ్ళీ గోపాలరావు కనపడలేదు. ప్రొడ్యూసరు అతని మాట ఎత్తలేదు. అదేమివిచిత్రమోగాని, అసలు అతన్ని మర్చిపోయినట్టే ప్రవర్తించారు స్టుడియోలో అందరూ.

వారంరోజులకి ఒకవుత్తరం వచ్చింది. అందులో అతను ఎడ్రసు రాయలేదు.

"నేను వూహించినట్టు మీరు బంగారు పంజరంలో వున్నారు. గుట్టుగావున్న మీ కాపరం నా వల్ల చెడటం నా కిష్టంలేదు. మీమీద చెప్పలేనంత గౌరవానురాగాలు వున్నాయి. మిమ్మల్ని మర్చిపోలేను; కాని మిమ్మల్నింక యిప్పట్లో కలుసుకోను" అదీ వుత్తరం.

రాత్రిళ్ళు గుండెనెప్పితో, తలాతోకాలేని ఆలోచనలతో నిద్దరపట్టేది కాదు. అసలు చాలారాత్రిళ్ళు సెట్సుమీదే

గడిపేదాన్ని. నిద్రకోసం మత్తుమందులు వాడటం మొదలెట్టాను.

స్వాభావికంగా రావలసిన నిద్ర రాకపోవడం, అధిక శ్రమ, మానసికంగా విశ్రాంతి లేకపోవడం, వీటన్నిటివల్లా నా ఆరోగ్యం పాడవుతోందని నాకు తెలుస్తూనేవుంది. కాని ఆరోగ్యాన్ని లక్ష్యపెట్టేస్థితి దాటిపోయాను. ఆరోగ్యం ఎవరికోసం? ఏం జేసుకుంటాను.

గోపాలరావు సంగతితో యింత హడావుడి అయ్యాక, అసలు నేను ఎవరితోనూ పరిచయం చేసుకోడం పూర్తిగా మానుకున్నాను. పైగా నా స్నేహంవల్ల అవతలవాళ్ళు చిక్కుల్లో పడతారనే విషయం గోచరం అయిందినాకు. ఎవరో అదృష్టవంతులకిగాని అర్థంచేసుకునే స్నేహితులూ, సన్నిహితులూ లభించరేమో ! ఎటొచ్చీ, నాబాధలూ, నా జీవితం సామాన్యమైనవి కాదు. అందువల్లే తట్టుకోలేకపోయేదాన్ని.

తెల్లారిగట్ల మూడింటికి మెలుకువ వచ్చింది. మళ్ళీ ఎంత ప్రయత్నించినాకన్నూ మూతపడలేదు తలంతాదిమ్ముగా వుంది. చదువుకోలేను. ఎలా?గడియారం టిక్ టిక్ మంటోంది. దాని ధ్వనివింటూ గది బాల్కనీలో వాలుకుర్చీ వేసుకు కూచుని సూర్యోదయందాకా గడిపాను. అయిదున్నరకి వీచే ప్రత్యూషపవనాల్తో కాస్త తలదిమ్మూ, కళ్ళుమంటలూ తగ్గినట్టయాయి.

ఆరున్నరకల్లా కాఫీతాగి – తోటలో గులాబీ మొక్కలకి బోదెచేస్తూ కూచున్నాను. ప్రపంచం యివ్వలేని మన

శ్శాంతి పూలముక్కలు యిచ్చేవినాను. వాటిమధ్య నా బాధలూ, సమస్యలూ అన్నీ చాలావరకూమర్చిపోయేదాన్ని.

స్నానంచేసి డ్రాయింగ్ రూములో కూచుని పేపరు చదువుకుంటున్నాను. ఎనిమిదిన్నర అవుతుంది. ఇంట్లోవాళ్ళొక్కరే లేస్తున్నారు. ఆయన తొమ్మిదీ పదింటిదాకా లేవరు.

ముందు వరండాలో ఎవరో మనిషితచ్చాడుతున్నాడు. నన్ను చూడనట్టు పూరుకున్నాడు. మరో పావుగంటకిచేతులు నలుపుకుంటూ "బాకీ జమకట్టమనీ, చాలాఅవసరంగావుందనీ చెప్పమన్నారమ్మా ?" అంటున్నాడు.

ఏంబాకి ? నేను సాధారణంగా బాకీపెట్టను. కాతాలు నాకు అలవాటులేదు. ఏంబాకీ? ఎంత? మొదలయిన ప్రశ్నలు వేశాను. పద్దు పుస్తకం తీసి చూపించాడు.

కిషన్‌లాల్ బట్టలకొట్లో రెండువేల పైచిల్కు. నా గుండె గుభేలుమంది. బట్టలకొట్లో రెండువేల రూపాయలే ! నేను ఏనాడూ అప్పుపెట్టలేదు. వెంటనే పైకంయిచ్చి,చీరెలు తెప్పించేదాన్ని. మళ్లీ పుస్తకం తీసుకు చూశాను. తడవకు నాలుగయిదువందలు చొప్పున అయిదారుసార్లు చీరెలబాకీ. ఆయన సంతకం – కాతా నా పేర. భేషుగ్గావుంది ఇకనేం ?

ఇంతలో వారు మేడమీాంచి వచ్చారు. గుమాస్తా వంక నిప్పులుకక్కుతూ చూస్తూ "నిన్ను అసలు యిక్కడికి ఎవడు రమన్నాడు ? వుండు మీా బాస్‌తో చెప్పి అసలు సంగతి కనుక్కుంటా. బాకీ యిప్పనని చెప్పు. వెళ్ళు..." అంటూ ఆ గుమాస్తాని తరిమేశారు. అతను గజగజలాడుతూ జారుకున్నాడు.

"ఇన్ని చీరె లెవరికి తెచ్చారు ?"

"ఇంట్లోకి."

"నా కెప్పుడూ తెచ్చియిచ్చినట్టులేదే ?"

"అంటే ఇంట్లో నువ్వొక్క-తెవే ఆడదానివా ? నీకు నేను కొని పెట్టడం ఎందుకూ ! అవి మిగతావారికి" అంటూ వెళ్ళిపోయారు.

ఆ మిగతావారు ఎంతమంది వున్నారో ? ఆబాకీ ఎలా చెల్లువేస్తారో? యిలాటివన్నీ ఆలోచించుకుంటూ నాగదిలోకి వెళ్ళిపోయాను.

పదిన్నరకి నాగదిలోకివచ్చి అన్నారు. "వాడు రాగానే బాకీ పుస్తకం నువ్వెందుకు తిరగెయ్యాలి ?"

"వాడు చూపించాడు. చూపిస్తే చూశాను. లేకపోతే నాకేం అవసరం ? ఇప్పుడు మించిపోయింది ఏమిటి ?"

"ఏమీలేదు. ఎలాగా చూశావు కాబట్టి చెప్తున్నాను. ఆ బాకీ యీ నెలాఖరున జమకట్టు !"

"నా కవసరంలేదు. మీరు బాకి చేసుకున్నారు. మీరు చెల్లకట్టుకోండి"

"అల్లాగా ! తొండముదిరి వూసరివెల్లి అయిందే !" అంటూ హేళనగానవ్వి, సిగరెట్ ముట్టించి "నీ కళ్ళతో చూశావుగా ఆ బాకీ ఎవరి పేరనుందో-వాళ్ళేకట్టుకుంటారు. వెర్రివేషాలు వెయ్యక ఆ డబ్బుకట్టు మర్యాదగా."

"నేను కట్టను"

"కట్టవు. లేకపోతే లాయర్ నోటీస్ యిమ్మనమని చెపుతాను. కట్టదట ! ఎందుకుకట్టవ్. మా చక్కగా కడతావ్ !"

"మీరు అప్పు తెచ్చారు. మీరే తీర్చండి"

"తీర్చకేం ! నిక్షేపంగా తీరుస్తాను. వాడికి ఎగ్గొడతా ననుకున్నావా? అందుకే చెల్లగట్టమని చెపుతోంది. కిక్కురుమన కుండా అణాపైసలతో చెల్లించు. తెలిసిందా ?"

"చెల్లించకపోతే"

"నీకే తెలుసు - నన్ను ఎదిరిస్తే ఏమవుతుందో! ఏదో ఆడదానివికదా అని వూరుకుంటున్నాను. అసలు నీకీడబ్బు ఎవరివల్ల వచ్చిందనుకున్నావ్ ? నేను పక్కనున్నాను కాబట్టి- నువ్వింత ఆస్తి సంపాయించావు. నీ పిచ్చి వేషాలు నా దగ్గిర కాదు. ఆస్తంతా నీపేర పెట్టుకొని ఆడదామనిఅనుకుంటున్నావేమో - అది ఏనాటి కన్నా నాదే: నీకింకా తెలియదేమో! ఎందుకులే అని వూరుకుంటున్నాను. మర్యాదగా డబ్బుకట్టు. నా సంగతి బాగా తెలుసు" అంటూ లేచారు.

"మీరు ఏమన్నా చేసుకోండి. కాని — యీ బాకీ విషయంలో చిల్లిగవ్వ యివ్వను" అన్నాను నిక్కచ్చిగా.

"ఇవ్వవూ. మా చక్కగా యిస్తావు — చూస్తాగా" అంటూ పక్కనున్న వెండిగ్లాసు కసిగాతన్ని వెళ్ళిపోయారు.

ఎందుకీ మనిషికి నామీద కసి. తాళికట్టినందుకేనా వారికి నామీద యింత అధికారం. ఈయనమీద ఆధారపడితేనో! మా యిద్దరిమధ్యా యీ పెండ్లి బాంధవ్యాన్ని తెంచివేస్తే - నాకే బెదరింపులనుంచీ-బాధల్నించీ విముక్తి దొరుకు

తుందేమో! నాకు ఏమీవద్దు. భర్తనుంచీ యీ చుట్టూ వున్న మనుషులనుంచీ విముక్తి దొరికితే - శాంతిగా ఒక్కదాన్నీ, నాఅంతట నేను కాలం గడుపుకుంటాను. దానికి ఏదన్నా దారివుందేమో ఆలోచించాలి. ఇదే ఆలోచనలతో ఆ సాయంత్రం నా లాయరువద్దకు వెళ్ళాను.

## ౮

మా లాయరుకు యించుమించు యాభై దాటాయి. చాలా మంచివాడు. లోతుపాతులు తెలిసిన మనిషి. మొదటి నుంచీ నా వ్యవహారాలన్నీ అతనిద్వారా జరుగుతున్నాయి.

అతనికి మా భార్యాభర్తలమధ్య భేదాభిప్రాయాలు వున్నవనే సంగతి నేను మొదటియిల్లు కొనేదాకా తెలియదు. నేను కారణాలు తెలియపరచలేదు కాని, యిల్లు నా వొక్కదానిపేరా కొనుక్కునేందుకు వీలుందేమో, అందుకు నాభర్త వల్ల ఏవిధమైన వత్తిడీ కలగదుకదా, అని అడిగాను. ప్లీడరు యిబ్బందులేవుగాని, అనవసరంగా పేచీలూ అల్లరీ పడకుండా, మంచిమాటలతో వ్యవహారం పరిష్కరించుకోడం శ్రేయమని సలహా యిచ్చారప్పుడు.

మా పెండ్లి, మా యిద్దరిమధ్యా భేదాభిప్రాయాలు, మాయింటి పరిస్థితులు - వారి దురభ్యాసాలూ - అప్పులూ- ఏ వొక్కటీ దాచకుండా ప్లీడరుగారికి అన్నీ తెలియబరచాను.

అన్నీ విన్నాక ప్లీడరుగారు, చాలా నెమ్మదిగా "నువ్వు నేను చెప్పినట్లు చెయ్యి. తొందరపడకు–నువ్వు స్త్రీవి. ఆవిషయం మర్చిపోకు" అన్నారు.

"నేనా అప్పుతీర్చను. నెలకి అయిదారొందలు సొంత ఖర్చుకి ఇస్తూ వచ్చాను. ఇంకా రెండువేలఅప్పు. నేను తీర్చనంటే తీర్చను" అన్నాను నిర్మొహమాటంగా.

"అయితే, మీవారు తాగుతారనీ, దురభ్యాసాలు వున్నాయనీ అంటున్నావుగదా – యీ ఒక్క అప్పుతోనే సరిపోయింది అని అనుకున్నావా?" అన్నారు ప్లీడరుగారు.

నాకా సంగతి తట్టనేలేదు. యింకా ఎక్కడెక్కడున్నాయో?

నువ్వు తొందరపడకు. ఇంకా చిన్నదానివి. నేను నా మనిషినిపంపి లోపాయికారిగా, అతని అప్పులూ అవీ కనుక్కుంటాను. నగలకొట్లో, బ్రాందీ షాపులో – యింకా యిలాటివేమన్నా వుండవచ్చు" అన్నారు.

"ఎక్కడెక్కడ ఏమున్నాసరే నేను తీర్చను. యింకా వారితో బతికి గెల్చుకు రాలేనేమోనని నాకు అనుమానంగా వుంది. విడిగా నేను వొంటిగా బతుకుతాను. అందుకే మీ సలహాకి వచ్చాను."

"నువ్వు వచ్చే ఆదివారంనాడు యిక్కడికిరా. ఎవరూ వుండరు. తీరిగ్గా అన్నివిషయాలు మనం మాట్లాడుకోవచ్చును" అన్నారు ప్లీడరుగారు.

ఆదివారం రెండుగంటలకి మళ్ళీ లాయర్ దగ్గిరికి వెళ్లాను. ఈలోపల నేను వొంటరిగా వుండేందుకు ప్లానులు మనసులో వేసుకున్నాను. ఆఫీసులో ప్లీడరుగారు వొక్కరేవున్నారు. నా రాకకి ఎదురు చూస్తున్నారు.

కూచోగానే మొదలుపెట్టారు. "నేను చాలా దూరం నిదానంగా ఆలోచించాను. నేను చెప్తున్నదంతా జాగ్రత్తగా విను" అంటూ మావారి అప్పులు వినిపించారు. "నగల షాపులో ఆరు వేలు, బ్రాందీషాపులో రెండువేలు, పెట్రోలు బంకుల్లో రెండువేలు, బట్టలకొట్లో సరేసరి - రెండువేలు, యింకా చిల్లర నాలుగువేలు. మొత్తం 15, 16 వేలు దాకా అప్పులు చదివి వినిపించారు. నాపై ప్రాణం పయిన ఎగిరిపోయి నట్టయింది.

ఇంతడబ్బు ఎక్కడినుంచి వస్తుంది? నేను వచ్చింది వచ్చినట్టు ఆ స్త్రీమీద పెట్టేశాను. రొఖ్ఖం నాదగ్గర నాలుగు వేలుకూడా లేదే—

"నే నొక్క కానీగూడా యివ్వను."

"అలా పెంకిగా యివ్వను—అంటే లాభంలేదు. ఇవ్వక ఏం చెయ్యదల్చుకున్నావో చెప్పు?"

"నేను ఒక్కదాన్ని విడిగా బతుకుతాను. నా స్వంత ఇంట్లో, స్వంత నౌకర్లని వుంచుకొంటాను."

"ఇది ఏ కాలమో—నువ్వు ఎవరివో - పూర్తిగా మర్చి పోయి గాలిలో మేడలు కడ్తున్నావు. నువ్వు లక్షగాదు — పది

లక్షలు సంపాయించినా స్త్రీవి. ఇది పురుషులలోకం. ఆ సంగతి నువ్వు మర్చిపోడానికి వీల్లేదు. పైగా హిందూదేశంలో పుట్టావు. ఇది హాలివుడ్ కాదు - భర్తనిమార్చి భర్తను ఏరుకునేందుకు."

"నాకు వేరేభర్త అక్కర్లేదు. అసలు ఏ మొగాడూ వద్దు. నాకు నేను వొంటరిగా వుంటాను. అదే నాకుకావాలి."

"నువ్వు వొంటిగావుంటే, మిగతా మొగవాళ్లు నిన్ను తేలిక చెయ్యకుండా వుంటారని అనుకోడం వుత్త తెలివి తక్కువ. ఇంట్లో మీరూ మీరూ ఏమి అనుకున్నా, నాలుగు గోడలమధ్య ఎన్ని యుద్ధాలు జరుగుతున్నా, బయటికి సంసారం గుట్టుగా కనపడుతోంది. కాబట్టి మరో మొగాడు నిన్ను చులకన చెయ్యడానికి ఆస్కారం లేకుండా వుంది."

"నేను జాగ్రత్తగా వుంటే, ఏ మొగాడూ నన్నేమీ అనలేడు."

"అని ప్రతి స్త్రీ అనుకుంటుంది. అది నీ మీదవుండే భయం, గౌరవం వల్లకాదు. నువ్వున్న కట్టుబాట్లకి భయపడి చౌరవతో ఎవరూరారు. అందంగల ధనవంతురాలు వంటిగా వుందీ అంటే, యీనాడు నీవంక కన్నెత్తి చూడటానికి భయపడ్డ ప్రౌఢ్యూసరే, రేపు అతి చనువుతీసుకునేందుకు వెనకాడడు. నీకు అటువంటి అనుభవం లేదుకాబట్టి యిలా తొందరపడుతున్నావ్. పోనీ ఒకమాట అడుగుతాను. నువ్వు మీ ఆయనను "కాదు" అని బయటికి వచ్చేస్తావనుకో, యింట్లో ఎవరన్నా నీపక్షం వుంటారా?" అని ప్రశ్నించారు.

"ఊహూ ! అంతా ఆయన పక్షమే !"

"చూశావా. మీవారు చాలా తెలివిగా వ్యూహ్యాం పన్నారు. అందుచేత నువ్వుకూడా చాలా తెలివిగా, మెళుకువతో తప్పించుకో."

"అయితే ఏం జెయ్మమంటారు ?"

"ముందు వాడావుడి చెయ్యకుండా అప్పులుతీర్చు."

"నేను తీర్చను. ఆయన అప్పులు ఆయనవే."

"భార్య అప్పులు భర్త తీర్చడంలేదూ ? అదీగాక, నీ పేరుబట్టి యిచ్చారు గాని ఆయన పేరుబట్టి యివ్వలేదు. కోర్టుకి ఎక్కినా, చివరికి నువ్వే తీర్చాలి ఆ అప్పులు. అందుకని గప్‌చిప్‌గా తీర్చెయ్యి."

"నాదగ్గిర అంత రొక్కంలేదు. పైగా యీ వెధవ అప్పుకి మొన్న కొన్న పొలం అమ్మనా ?"

"ఆ మాట నేను అనటంలేదు. పోనీ నెలకి యింత చొప్పున, అని అయిదారు నెలల్లో కొట్టివేయిద్దాం."

"మళ్లీ వారు అప్పుచేస్తే ?"

"అప్పులు చేయకుండా ఆపలేం. ఎంచేతనంటే–తండ్రి లక్షాధికారిఅయితే, కొడుక్కి అప్పులిచ్చి, నోటు రాయించుకునేవారు, ఎల్లప్పుడూ వుంటూనే వుంటారు. అల్లాగే నీ ఆస్తి ఎప్పటికన్నా ఆయనదేనని, అప్పులు యిస్తూనే వుంటారు. ఎటొచ్చీ, యింత వుమ్మరంగా యివ్వకుండా...అతనీన్నీ, పైవాళ్ళనీ యిద్దర్నీ బెదిరించి నేను ఆపుతాను. ముందు ఈఅప్పులు చెల్లగట్టడం మంచిది" అన్నారు.

"అయితే నాకు యీ వూబినుంచి విముక్తిలేదాండి?" అని అడిగాను నిస్పృహగా. లాయరుగారు జాలిగాచూసి వూరుకున్నారు. నాకు మరో అనుమానం వచ్చింది.

"అయితే నా డబ్బుమీద వారికి హక్కు ఎల్లకాలం వుంటుందాండి ?" అని అడిగాను.

"ఆహా ! ఎల్లకాలం వుంటుంది. అంటే నువ్వు సంపాయించేది, అమ్మే అధికారం లేకపోయినా...నీ పేరిటఅప్పన్నా చెయ్యవచ్చును." అన్నాడు ఆయన.

"నేను పోయాక ?" అని అడిగాను.

"తండ్రి ఆస్తి కొడుక్కీ, భర్త ఆస్తి భార్యకీతదనంతరం ఎలా చెందుతుందో, అలాగే నీ ఆస్తి మీ ఆయనకి చెందుతుంది. మీదాంపత్యంలోని చిక్కులు బయటకి కనపడకుండా వుండేందుకు, అతను మేనగోడల్ని పెళ్ళాడలేదు. చాలా దూరపు అలోచనవుంది; మీ ఆయనకి" అన్నారు.

"ఎందుకండీ యీ వెధవ నక్కజిత్తులు. హాయిగా నిర్మలంగా అందరికిమల్లే బతక్క !"

"అందరికిమల్లే మీజీవితాలున్నాయా చెప్పు? అందరూ నీకు మల్లే సినిమాతారలై, లక్షల ఆర్జించారా ? అందరి భార్యలు చూస్తూచూస్తూండగా ఇంతగడించారా ? నువ్వూ అందరికిమల్లేవుంటే, మీఆయనా మామూలుగా వుండేవాడు. అసలు మీ జీవితాలే మామూలుకి భిన్నమైనాయి. అందుకని అందరి సమస్యల్లాగ మీవి లేవు."

"మీరు ఆయన్ని వెనకేసు కొస్తున్నారు."

"వెనకేసుకురావడం లేదమ్మా, బయట.... వాణ్ణి కాబట్టి నీకుమల్లేకాక .... కోపతాపాలు లేకుండా .... చూడకలుగుతున్నాను. నిన్ను పెళ్ళాడేవేళకి అతనూ మామూలు సగటు మనిషికిమల్లే ప్రేమించి పెళ్ళాడాడు. కాలంగడిచినకొద్దీనువ్వు ఆర్థికంగా ఎదిగిపోవడం మొదలుపెట్టావు. అతను బయలు దేరిన చోటులోనే ఆగిపోయాడు. చేతినిండాపనీ, మనసుకి ఆలోచనా, తగిన బాధ్యతలూ, లేక అలా అయిపోయాడు."

"వ్యాపారం చెయ్యమని వారికి చాలాసార్లు చెప్పి చూశాను. మేనకోడలు పెళ్ళి అయిపోయాక, ఒక పదివేలు ఇస్తాను ప్రెస్ పెట్టమన్నాను. "నువ్వు సంపాయిస్తున్నావుగా-నేను కష్టపడటం ఎందుకు" అని నవ్వి వూరుకున్నారు. నన్నేం చెయ్యమంటారు ? మీరే చెప్పండి."

"నీదీకాదు-అతనిదీ కాదు తప్పు. తిని కూచోడం అలవాటు అయ్యాక అతన్ని కష్టపడమంటే ఎలా వొప్పుకుంటాడు. ఒకవేళ ప్రెస్ పెట్టినా సంవత్సరానికి ఏ రెండువేలో లాభం వస్తుంది. ఈ లోపల నువ్వు ఇరవైవేలు సంపాయిస్తుంటెవి. ఏ నాడైనా అతనికంటే సంపాదన హెచ్చాయను. అసలు ఆ పరిస్థితిలో ఎవరన్నా అల్లాగే అవుతారు. నీ సమర్థత యాక్టింగ్‌లో రాణిస్తే, అతని తెలివి నీ చుట్టూ వలపన్ని వక్రమార్గాలు ఆలోచించడంలో వుపయోగపడింది. నీ పేరు మరుగున అతనిపేరు పడిపోవడం భరించలేకపోయాడు. దాని కోసం యింట్లోవాగి మంచితనాన్నికొని, నిమీాద సాధిస్తున్నాడు. అసలు యీా పరిస్థితులకి కారణం మీారిద్దరూ కాదు. ధనం-ముమ్మాటికీ ధనం అని చెప్పవచ్చు. నీ కొచ్చిన కీర్తికి

నువ్వు అనుభవించాల్సిన శిక్షయిది. పాపం అతనుమటుకు బాధపడడంటావా ?

"ఏమో ? మరోమాట, ఈ ఆస్తీ డబ్బూ అంతా ఆయనదేనని చాలా భరోసాపెట్టుకుని వున్నారు. ఆయనకే చెందుతుందని అంటారా ?"

"ఆ-నీ తదనంతరం."

"నా ఆస్తిమటుకు యింట్లోవాళ్ళెవ్వరికీ చెందకూడదు. ఆఖరికి ఆయనకికూడా చిల్లికానీరాగూడదు. నేబతికినన్నాళ్లూ నామీద కసి వాళ్ళు తీర్చుకుంటే, నేను చచ్చిపోయి వాళ్ళ మీద కసితీర్చుకుంటాను. ఆ స్తి తనకి దక్కుతుందని ఆయనకి మహా ధైర్యంగా వుంది" అన్నాను.

"నీకు ప్రేమాస్పదులైన వాళ్ళకి రాయి" అన్నారు.

"అలాటి వారెవరూ నాకులేరు."

"అలా అయితే ఏ సంఘానికో, స్కూళ్ళకో, హాస్పటళ్ళకో, దేవుడికో, – దేనికో ఒకదానికి రాయవచ్చు" అన్నారు.

"నా ఆస్తి సేవాసదనానికి రాస్తాను. ప్రతిచిల్లిగవ్వా ఆ సదనానికి చెందాలి. నేను రాసినట్టు మా వాళ్ళకి తెలియకుండా వుంటుందా?"

"ఓ - దానికేం, అవన్నీ నేను చూసుకుంటాను" అన్నారు.

నా తదనంతరం యిళ్లు రెండూ, యిరవై ఎకరాల తోట, నాలుగు గ్రౌండ్ల స్థలమూ సదనానికి చెందేటట్టు

విల్లురాసి భద్రంగా రిజిష్ట్రరాఫీసులో వుంచాను, ఆ మూడో రోజున.

కాలం గడుస్తోంది. నా ఆరోగ్యం ఆనాటికానాటికి క్షీణిస్తోంది. మొదట్లో నిద్రకి మాత్రలు వేసుకుంటే నిద్ర వచ్చేది. రానురాను అవికూడాపనిచెయ్యడంమానుకున్నాయి. ఒక్కొక్క రాత్రి, గుండెల్లో చెప్పరాని బాధతో నిద్రపట్టేది కాదు. గంటా రెండుగంటలూ ప్రాణం కడగొట్టినట్లు తన్నుకు లాడేదాన్ని. వొళ్ళంతా ముచ్చెమటలుపట్టి, తర్వాతమగతగా పడివుండేదాన్ని. ఎందుకైనా మంచిదని మా నాన్నలా చని పోతానేమోనని అనుమానంతట్టి ఏడాదిక్రితం మీ స్నేహి తుడు రాజన్ దగ్గిరికి వెళ్ళాను. ఆయనే పెద్దడాక్టరుని పిల్చు కొచ్చి నా గుండెనీ శరీర పరిస్థితినీ పరీక్ష చేయించారు.

నేను పూర్తి విశ్రాంతి - మానసికంగా దైహికంగా తీసుకోకపోతే ఒక ఏడాదికంటే బతకనని ఆ పెద్దడాక్టరు నా ముఖంమీదే చెప్పాడు. ఆతర్వాత మీరాజన్‌తో మాట్లాడి నా జబ్బు సంగతి ఎవ్వరికీ వెల్లడి చెయ్యవద్దని మాటతీసు కున్నాను. నా సంగతి యింట్లోగూడా ఎవరికీ తెలియదు. వారి సౌఖ్యాలకి గడ్డురోజులు రాబోతున్నాయని యింట్లో ఎవరూ వూహించుకోలేకపోయారు.

ఎటొచ్చి ఎటుబోయినా ఆస్తిమటుకు ఇంట్లోవారికి దక్కకూడదు. ఈ లోపల మరోసారి లాయర్ని కలుసు కున్నాను. నాదగ్గిర ముప్ఫైవేలు కిమ్మతుచేసే నగలున్నాయి. అవన్నీ లాయరుద్వారా బాంకులోపెట్టాను. మామూలుగా

పైకి వాడుకునే నగలుమటుకు ఉంచాను. ఈ పనులన్నీ చాలా జాగ్రత్తగా మా వారికీ, ఇంట్లోవారికి తెలియకుండా కానిచ్చాను. డాక్యుమెంట్లూ, నగలూ అన్నీ లాయరుద్వారా భద్రంగా వున్నాయి.

రాతకోతలన్నీ అయాక "మా నాన్నకిమల్లే నాకు కూడా చావు నిద్దట్లో వస్తుందని అంటున్నారు. ఒకవేళ నేను ఆ యింట్లోనే చనిపోతే, ఆస్తిపాస్తులు వాళ్ళు రాయించుకుంటారంటారా?" అన్నాను లాయరుగారితో.

"లేదు అసలు వాళ్ళు అలారాయించుకున్నా చెల్లదు. నువ్వు ముందుగానే ఆస్తి అంతా సేవాసదనానికి రాస్తివి. దానికి నేనుగాక మరియిద్దరు సాక్షులుగూడా సంతకం చేశాము."

"ఉన్న రెండుకార్లూ-ఇంట్లోవున్న వెండిసామానూ-నా బట్టలూ నగలూ ఇవన్నీ వాళ్ళకే వెళ్ళిపోతాయి. ఎటొచ్చీ స్థిరాస్థిమటుకు బయటికి పోతుంది" అన్నాను నేను.

"ఇంకా నీకు ఎన్నాళ్ళు పనివుంది యిక్కడ?" అని అడిగారు లాయరు.

"ఒక నెల."

"వొంట్లో బావులేదంటున్నావు కనక నర్సింగ్ హోమ్‌లో ఉండి ఒక ఏడెనిమిది నెలలు రెస్టుతీసుకో. ఆపైన చూదాం" అన్నారు ప్లీడరుగారు.

డాక్టరు నాలుగయిదు నెలలకంటే బతకనంటున్నారు."

"డాక్టర్లూ, లాయర్లూ వీళ్ళిద్దరేనా నీకు సలహాలిచ్చేది. నీకు నువ్వాలోచించుకో. ముందు అక్కడికి వెళ్ళివుండు. ఈ లోపల ఇక్కడ వీళ్ళు ఎలా గడుపుకుంటారో చూద్దాం."

"అప్పులు చేస్తారు."

"చెయ్యనీ. అవన్నీ తర్వాత ఆలోచించుకోవచ్చును. 'జబ్బుగావుంది రెస్టుతీసుకోమన్నాడు డాక్టర'ని చెప్పి ముందు ఇక్కడినుంచి కదులు" అన్నారు లాయరుగారు.

వారంరోజుల క్రితం వారికి ఎలాగో, నా రాతకోతలు. కొంచెం అనుమానంగా చెవినపడ్డాయట. లాయర్ని అడిగారట. డాక్టరునికూడా నా ఆరోగ్యంగురించి వాకబుచేశారట. రాజన్‌గారూ - లాయర్‌గారూ సమాధానం యివ్వలేదుగాని, రాజన్‌గారు తీసుకువచ్చిన హార్ట్‌స్పెషలిస్టు ఆరు నెలల క్రితమే చాలా ప్రమాదంగా వుందని తను చెప్పినట్టూ, యింక ఆట్టేరోజులు బ్రతకననీ చెప్పారుట.

అది విని పరుగెత్తుకొచ్చారు. ఆ స్థిపాస్తులు గురించి నన్ను నిలవదీశారు. నేను ఏమీ రాయలేదని బుకాయించాను. ఆయన నమ్మలేదు. నన్ను మళ్ళీ మద్రాసు వచ్చెయ్యమని బలవంతంచేశారు మొన్నరాత్రి.

"నేను రాను, నా కిక్కడే హాయిగావుంది" అన్నాను.

"ఈమారుమూల ఎందుకు. అక్కడ ఇంతకంటే హాయిగా వుండేటట్టు చేస్తామరి"

"నేను రాను"

"ఎందుచేత"

"రావాలనిలేదు"

"బలవంతంమీద తీసుకెళ్తే!"

"మీరు బలవంతంగా తీసుకెళ్లేందుకు యిది మద్రాసు కాదు...నర్సింగ్‌హోమ్"

"డాక్టర్నే వప్పించి తీసుకెళ్తాను."

"ఆయన మూడునెలలదాకా గేటుదాటేందుకు వీలులేదన్నారు" అన్నాను నెమ్మదిగా.

"మొదటినుంచీ నీది వెధవబుద్ధి. నీకసలుజబ్బూలేదూ, పాడూలేదు. అంతా నటన"

"బుద్ధిలేనిదానికోసం మీరెందుకు బాధపడ్తారు. మొదటినుంచీ తెలిసికూడా, యిన్నాళ్ళు ఎందుకుంటున్నారు నాతోపాటు. ఎప్పుడో వదిలెయ్యకపోయారా?"

"ఎందుకు వదలడం? నేను నీ అందంచూసీ, నీ పాతివ్రత్యంచూసీ, పెళ్ళాడానని అనుకుంటున్నావా? నీడబ్బుకోసం నిన్ను చేసుకున్నాను. లేకపోతే శ్యామలనే పెళ్ళాడేవాడిని."

"పోనీ, తర్వాతనన్నా శ్యామలని పెళ్ళాడకపోయారా?"

"ఏ పెళ్ళీ చేసుకోకుండా వుంటేనే, నన్ను పురుగుకింద చూసి, నీడబ్బునువ్వు జాగ్రత్త చేసుకుంటున్నదానివి, దాన్ని పెళ్ళాడితే...అది వంకగా...గోపాలం కాకపోతే వాడిలాంటి వాణ్ని మరొకణ్ని చూసుకు, నువ్వు వుడాయించకుండా వుండేదానివా!"

"పాపం. నేను మర్చిపోయినా...మీరుమాత్రం మర్చి పోలేదు–ఆ గోపాలాన్ని."

"ఎలా మర్చిపోతాను? వెధవ,సందుదొరుకుతుందేమో ఎగరేసుకుపోదామని చూశాడు."

"పాపం...మీకుమల్లేనే"

"నోర్మూయ్. తన్నులు తింటావ్!"

ఇలా తెల్లవార్లూ జాగరణచేశాము. నయానాభయానా నన్ను మద్రాసు తీసుకెళ్లాలని చూశారు. అక్కడికి వెళ్ళాక మళ్లీ అన్నీ తిరిగి రాయించుకోవాలని ఎత్తు.

ఇది పిల్లీ ఎలకా చెలగాటంలా అయింది. వెళ్ళకుండా ఎలాగన్నా తప్పించుకోవాలని నేను, ఎలాగన్నా తీసుకెళ్ళాలని వారూ–యిలా యిద్దరం తెల్లవారేదాకా మాటల్తో వొకరి నొకరం తిట్టుకుంటూ గడిపాం.

తెల్లవారి మీదగ్గరకొచ్చారు. మీరుచెప్పిందివిని అగ్గి రాముడయిపోయారు. ఆయనకళ్ళు చూస్తే నాకుచాలాభయం

వేసింది. అవి అతిక్రూరంగా, ఎర్రగా మెరిశాయి, నిప్పుకణి కలులాగా.

నావంకచూసి "గెల్చాననని అనుకుంటున్నావుకదూ! అదికల్ల అని రుజువు చేసుకుంటాను. నిన్ను యింతటితో వదులుతానని అనుకోకు" అంటూ వెళ్ళిపోయారు.

రేణుక గజగజ వణికిపోతోంది. తుపానులో చిగురు టాకులా ఊగిసలాడిపోతోంది-ఆమెభయంవల్ల. రెండుచేతులు తీసుకుని "భయపడకు...యిక్కడ ఎవ్వరూ లేరు. నేనుండగా నీకేంభయంలేదు, యిట్లాచూడు, రేణుకా!" అన్నాను.

"నన్ను బతకమని మీరు కోరారు. ఇంకా మీకు ఆ కోర్కెవుందా? నేను బతికినా, పిచ్చికుక్కనుతరిమినట్టుతరిమి, నేను ఏమూలవున్నా వేటాడి పట్టుకుంటారు. ఎందుకు-నేను బతకటం చెప్పండీ, అంది రేణుక కన్నీళ్ళుకారుస్తూ.

నాకు నోటమాటరాలేదు. ఆ తర్వాత వారంరోజులు ఆమెకి మనస్థయిర్యం కలిగిద్దామని, జీవితంలో ఆలంబనగా నా ప్రేమని అర్పిద్దామనీ, శాయశక్తులా ప్రయత్నించాను. కాని రేణుక నిరాశాజీవి, అశక్తురాలు. లోకంతో పోరాడి పోరాడి అలసిపోయింది రేణుక. సోమవారం తెల్లారగట్ల నాచేతుల్లో ప్రాణాలు వదిలింది.

ఆమె కోరికప్రకారం నర్సింగ్‌హోమ్‌కి దక్షిణంగా, దూరానకనిపిస్తున్న ఆ రెండు చెట్లమధ్యనీ, ఆమె దేహం బూడిద అయింది. ఆ చిన్న తులసికోట-ఆమె చిహ్నం.

బ్రతికున్నంతకాలం పొందలేని విజయాన్ని రేణుక చని పోయి సాధించింది. మృత్యువుతో కలిసి భర్తనీ, బంధువుల్నీ వోడించింది. ఆమె చివరిఘడియలు ప్రశాంతంగా వెళ్ళి పోయాయి. నవ్వుతూ కళ్ళుమూసేసింది. మరణంలోకూడా చిరునవ్వు ఆమె అధరాన్ని వదలలేకపోయింది. "ఇప్పుడు చెప్పండి; మనుషులు ఆస్తులెందుకు సంస్థలకిరాస్తారో".... అన్నాడు డాక్టరు రామారావు. ఎవరూ మాట్లాడలేదు. అందరూ పారిజాత పరిమళంవస్తున్న దిక్కుగా తులసికోట వైపుకి నడిచారు.